
నాటి ఆంధ్ర వైద్య కళాశాల



నేడు స్త్రీశక్తికి శ్రీకారం

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రయాణం ఉచితం

- సాయంత్రం 4.00 గంటలకు మద్దిలపాలెం డిపో, 5.30 గంటలకు మధురవాడ, వాల్తేరు, విశాఖపట్నం, గాజువాక, స్టీల్ సిటీ, సింహాచలం డిపోల నుంచి ఐదేసి బస్సులు ప్రారంభం
- శనివారం నుంచి పూర్తిస్థాయిలో ఉచిత రవాణా సదుపాయం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు


బస్సును శుభ్రం చేస్తున్న సిబ్బంది



ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'స్త్రీశక్తి' పథకం (ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సదుపాయం) జిల్లాలో శుక్రవారం ప్రారంభం కానుంది. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సాయంత్రం 4.00 గంటలకు మద్దిలపాలెం డిపోలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కానున్నారు. అనంతరం 5.30 గంటలకు మధురవాడ, వాల్తేరు, విశాఖపట్నం, గాజువాక, స్టీల్ సిటీ, సింహాచలం డిపోల్లో స్థానిక ఎమ్మెల్యేలు స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభిస్తారు.

స్త్రీశక్తి ప్రారంభోత్సవానికి సంబంధించి ఆర్డినరీ, పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆర్టీసీ అధికారులు సిద్ధం చేశారు. ప్రతి డిపోలోను ఐదేసి బస్సులను ప్రారంభించాలని నిర్ణయించారు. ఇటీవల ఆర్టీసీలో చేరిన కొత్తబస్సులకు మరిన్ని హంగులు సమకూర్చారు. ఉచిత బస్సులు శనివారం ఉదయం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నట్టు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు.

ఉచిత ప్రయాణానికి జీరో ఫేర్ టికెట్ ఇచ్చేందుకు టికెట్ ఇష్యూయింగ్ మెషీన్‌లు (టిమ్స్) అందుబాటులోకి వచ్చేశాయి. ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని ఆర్డినరీ, పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లకు సంబంధించిన అన్ని టిమ్స్‌కు ఈ సాఫ్ట్‌వేర్‌ను లోడ్ చేశారు. ఈ బస్సుల్లో ప్రయాణించే పురుషులకు వారు ప్రయాణించే

... మిగతా 8వ పేజీలో

ఘాట్ రోడ్లలో పథకం వర్తించదు

ఘాట్‌రోడ్లలో రాకపోకలు సాగించే బస్సుల్లో మాత్రం స్త్రీశక్తి పథకం వర్తించదు. ఘాట్ రోడ్లలో తిరిగే బస్సుల్లో నిర్దేశించిన మేరకే ప్రయాణికులను అనుమతిస్తారు. దాదాపు వాటిని సీటింగ్ కెపాసిటీతోనే ఆపరేట్ చేశారు. ఉచిత ప్రయాణం అనేసరికి మహిళలు ఘాట్ రోడ్డు బస్సుల్లో వాటి సామర్థ్యానికి మించి ఎక్కే అవకాశం ఉంది. అందువల్ల బస్సులు అధిక లోడ్‌తో ఘాట్ రోడ్డులో ప్రయాణించడం సరికాదని గుర్తించిన ఆర్టీసీ తాత్కాలికంగా ఆ రూట్లలో స్త్రీశక్తి పథకం అమలు నుంచి మినహాయించింది. విశాఖ రీజియన్‌లో సింహాచలం, యారాడ, కైలాసగిరి ఉన్నాయి. ఈ రూట్లలో తిరిగే బస్సులకు స్త్రీశక్తి పథకం వర్తించదు. అలాగే విశాఖ నుంచి పాడేరు, భద్రాచలం, అరకు రాకపోకలు సాగించే బస్సులకు కూడా స్త్రీశక్తి పథకం వర్తించదు. మహిళలైనా సరే టికెట్ తీసుకోవలసిందే.

ఆంధ్ర వైద్య కళాశాలలో స్వాతంత్ర్య వీచిక

ఆంగ్లేయుల డ్రెస్ కోడ్ ఉల్లంఘన

- 1921 సెప్టెంబరు 28న సూటు, బూటు వదిలి టోపీ, ఖాదీ వస్త్రాలతో తరగతులకు హాజరు
- క్షమాపణ చెప్పేందుకు నిరాకరించిన 32 మందిని డిబార్‌ను చేసిన పాలకులు
- తన యంగ్ ఇండియా పత్రికలో ప్రస్తావించిన గాంధీ

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):

భారత స్వాతంత్ర్య పోరాటంలో విశాఖకు విశిష్ట స్థానం ఉంది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటం ఒకటి. దేశంలో తొలితరం వైద్య కళాశాలల్లో ఒకటైన ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు 1921లో అప్పటి పాలకుల ఆదేశాలను ధిక్కరించి ఖాదీ దుస్తులు ధరించి తరగతులకు హాజరయ్యారు. దీంతో 32 మంది విద్యార్థులను కళాశాల నుంచి తొలగించారు. దాని గురించి మహాత్మాగాంధీ తన 'యంగ్ ఇండియా'లో ప్రత్యేకించి ప్రస్తావిస్తూ వారి దేశభక్తిని ప్రశంసించారు.

విశాఖపట్నంలో 1902లో పాత పోస్టాఫీసు సమీపాన పది మంది విద్యార్థులతో విక్టోరియా డైమండ్ జూబ్లీ వైద్య పాఠశాల ప్రారంభమైంది. గోడే కుటుంబానికి చెందిన గోడే నారాయణగజపతిరావు పాఠశాలకు సాయం అందించారు. నారాయణ గజపతిరావు కోర్కె మేరకు ఆయన

... మిగతా 8వ పేజీలో


పోలీస్ బ్యారెక్స్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

నేడే జెండా పండుగ

పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్
- ఎనిమిది స్టాళ్లు, ఏడు శకటాలు సిద్ధం
- పలు వర్గాలకు రూ.214 కోట్లు ప్రోత్సాహకాల పంపిణీ

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీస్ పరేడ్ మైదానం సిద్ధమైంది. రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు పతాకావిష్కరణ చేస్తారు. అనంతరం గౌరవ వందనం స్వీకరిస్తారు. ఆహుతుల కోసం వేదికకు రెండు వైపులా టెంట్లు వేసి కుర్చీలు వేశారు. ఎనిమిది పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఇంకా జీవీఎంసీతో పాటు సమాచార పౌర సంబంధాలు, వ్యవసాయం, ఉద్యానవన, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, పశుసంవర్ధక శాఖ, డ్వామా,మత్స్యశాఖ, బీసీ, ఎస్సీ సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ, తదితర శాఖలు స్టాళ్లు ఏర్పాటుచేస్తున్నాయి. జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, విద్య, వైద్య ఆరోగ్య, గృహ నిర్మాణ, ప్రణాళికా శాఖలు, ఈపీడీసీఎల్ శకటాలు సిద్ధమ య్యాయి. పలు వర్గాలకు రూ.214.99 కోట్ల ప్రోత్సాహకాలను అందించనున్నారు. కాగా జిల్లాలో పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన సుమారు 400 మందికి ప్రశంసాపత్రాలు అందించనున్నారు. వర్షం వచ్చినప్పటికీ కార్యక్రమం కొనసాగేలా ఏర్పాట్లుచేశారు.

వెండి వితరణలపై తేలని లెక్కలు

- ఫిర్యాదు చేసి పది నెలలైనా స్పందన శూన్యం
- విచారణలో ఉన్నతాధికారుల జాప్యం
- కనకమహాలక్ష్మి ఆలయానికి గతంలో 6.3 కిలోల వెండి ఇచ్చిన యూబీఐ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కనకమహాలక్ష్మి ఆలయంలో వెండి తాపడం లెక్కలు తేల్చడంలో దేవదాయ శాఖ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. నగరంలో ప్రముఖ షాపింగ్ మాల్ అధినేత గత నవంబరులో తనకు జరిగిన అన్యాయంపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఇంతవరకూ దానిని పట్టించుకోలేదు. అమరావతిలో దేవదాయ శాఖ కమిషనర్ నుంచి విశాఖలో ఆలయ ఈఓ వరకూ ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు.దీనినుంచి ఎవరినో కాపాడాలని అంతా యత్నిస్తున్నట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జ్యోతి మాధవి ఆలయ ఈఓగా ఉన్న సమయం (2021)లో అమ్మవారి విగ్రహం వెనుక వెండి తాపడం (మకర తోరణం) కొత్తది చేయిస్తామని ప్రకటించగా, అనేకమంది దాతలు ముందుకు వచ్చారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు 6.3 కిలోల వెండి బిస్కెట్లు ఈవో జ్యోతి మాధవి ఇచ్చారు. ఈ అంశం పత్రికల్లో కూడా ప్రచురితమైంది. ఆ తరువాత మరికొందరు కూడా వెండి విరాళంగా ఇచ్చారు. షాపింగ్‌మాల్ అధినేత వెండి తాపడాన్ని 60.830 కిలోలతో తయారుచేయించారు. అందుకోసం ఆయనకు ఆలయ వర్గాలు 28.500 కిలోలు వెండిని వివిధ రూపాల్లో ఇచ్చాయి. ఇంకా 38.413 కిలోల వెండి తమకు రావాలని ఆ షాపింగ్ మాల్ అధినేత దఫదఫాలుగా కోరారు. ప్రతి స్పందన లేకపోవడంతో గత ఏడాది నవంబరు ఆరో తేదీన షాపింగ్ మాల్ లెటర్ హెడ్‌పై ఆలయ ఈఓకు సవివరంగా లేఖ రాశారు. బకాయి వెండితో పాటు తయారీ చార్జీలుగా రూ.6,08,300 ఇవ్వాల్సి ఉందని, దీనిని నిర్ణయించి వీలైనంత త్వరగా చెల్లించాలని కోరారు. దీనిపై సమాధానం లేదు.

వెండి లెక్కలు తేలడం లేదని చర్చ ప్రారంభం కావడంతో ఈ నెల మొదటి వారంలో ఆలయ మాజీ ధర్మకర్త ఒకరు దేవదాయ శాఖ కమిషనర్‌కు ఆలయంలో జరిగిన వెండి కుంభకోణంపై లేఖ రాశారు. అందులో యూనియన్ బ్యాంక్ ఇచ్చిన 6.3 కిలోల వెండి బిస్కెట్ల గురించి పేర్కొన్నారు. వారికి కూడా అధికారులు రశీదు ఇవ్వలేదని ఆరోపించారు. ఆలయ సిబ్బందిలో ముగ్గురికి పదేళ్ల సర్వీసు పూర్తయినందుకు వారిని రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, వారికి ఎరియర్స్ రూపంలో రూ.30 లక్షల వరకు రాగా, వారికి తలా కొంత ఇచ్చి, మిగిలింది అప్పుడు పనిచేసిన ఆలయ అధికారులు పంచుకున్నారని ఆరోపించారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ విచారణ చేసి ఐదు నెలలైనా ఎటువంటి చర్యలు చేపట్టలేదని కూడా పేర్కొన్నారు. వీటిపై విచారణ వేగవంతం చేసి కారకులపై చర్యలు తీసుకోవడమే కాకుండా, వెండిని రికవరీ చేయాలని కోరారు. ఆలయ అధికారులు, దేవదాయ శాఖ అధికారులు ఈ వెండి విషయంపై పెదవి విప్పడం లేదు. విచారణ జరుగుతున్నని చెబుతున్నారే తప్ప దానిని ఎప్పటికి ముగిస్తారో వెల్లడించడం లేదు. డిప్యూటీ కమిషనర్ ఐదు నెలల క్రితమే విచారణ చేపట్టినట్టు మాజీ ధర్మకర్త ఫిర్యాదు ద్వారా వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా షాపింగ్‌మాల్ అధినేత ఫిర్యాదు చేసి పది నెలలైందని తేలింది. పాత ఈఓల ద్వారా వెండి లెక్కలు ప్రస్తుత ఈఓ శోభారాణికి వారం క్రితం అప్పగించారు గానీ ఈ మకర తోరణం లెక్కలు తేల్చకపోవడం గమనార్హం. ఎవరినో ఈ కేసు నుంచి తప్పించడానికి అంతా కలసి యత్నిస్తున్నారనేది మాత్రం వాస్తవం.

పీ-4కు 4,000 మంది మార్గదర్శకుల గుర్తింపు

- 38,000 బంగారు కుటుంబాలతో మ్యాపింగ్
- నగరంలో ఐటీ పార్కు అభివృద్ధికి రహేజా గ్రూపు ఆసక్తి
- త్వరలో 2,000 మందితో కాగ్నిజెంట్ ప్రారంభం
- సొంత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యేంత వరకూ అద్దె భవనంలో కార్యకలాపాలు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్



విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 పథకం కోసం ఇప్పటివరకూ నాలుగు వేల మంది మార్గదర్శకులను గుర్తించామని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలుత 73 వేల బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. తరువాత సర్వే చేస్తే వారిలో సుమారు 10 వేల మంది అన్హరులు ఉన్నారని తేలిందన్నారు. మిగిలిన 63 వేల మందితో మార్గదర్శకులను అనుసంధానం చేసే కార్యక్రమం చురుగ్గా సాగుతుందన్నారు. ఇప్పటివరకూ గుర్తించిన నాలుగు వేల మంది మార్గదర్శకులను 38 వేల మంది బంగారు

... మిగతా 8వ పేజీలో

మూడు కుటుంబాలను దత్తత తీసుకున్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ జిల్లాలో మూడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఆరిలోవలో ఆటోడ్రైవర్, దొండపర్తిలో భర్త లేని మహిళ కుటుంబం, ఆనందపురంలో తల్లిలేని ఇద్దరు పిల్లలను కలెక్టర్ దత్తత తీసుకున్నారు. ఆరిలోవ వాసికి సొంతంగా ఆటో లేకపోవడంతో అద్దె ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డిగ్రీ పాసైన పెద్దకుమార్తెకు ఉద్యోగం, పదో తరగతితో చదువు ఆపేసిన చిన్న కుమార్తెకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అలాగే దొండపర్తిలో భర్త లేని మహిళకు ఒక కుమారుడు ఉన్నాడు. అతను డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తనకు పింఛన్ ఇవ్వాలని ఆమె కోరుతున్నారు. ఆనందపురంలో ఇద్దరు పిల్లలు ప్రస్తుతం తాతగారింటి వద్ద పెరుగుతున్నారు. మతిస్థిమితం కోల్పోయిన తల్లి ఆచూకీ లేదు. తండ్రి కూలి పనులు చేస్తున్నా మద్యానికి బానిస కావడంతో ఆరు, నాలుగు తరగతులు చదువుతున్న పిల్లల జీవనం, చదువుకు ఇబ్బంది ఉంది. ఇద్దరు పిల్లలకు హాస్టళ్లలో సీట్లు ఇప్పిస్తే చదువుకుంటామని వారు కోరారు. దత్తత తీసుకున్న మూడు కుటుంబాలను రెండు రోజుల క్రితం ఛాంబర్‌కు పిలిపించుకుని కలెక్టర్ మాట్లాడి పలు వివరాలు సేకరించారు. అన్నివిధాలా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

కబళించిన కెరటం

ఆర్కే బీచ్‌లో మహిళ మృతి

- మృతురాలి స్వస్థలం సికింద్రాబాద్
- రక్షించేందుకు యత్నించిన యువకుడి గల్లంతు
- మరొకరిని కాపాడిన లైఫ్ గార్డులు


వసంత మృతదేహం


ప్రమాదం నుంచి బయటపడిన సాయికృష్ణ

బీచ్ రోడ్డు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామకృష్ణా బీచ్ సందర్శనకు వచ్చిన వారిలో ఒక మహిళ సముద్రంలో మునిగి మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. ఇంకొకరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌లోని విమలాదేవి నగర్‌లో గల మైత్రీ నివాస్‌లో నివాసముంటున్న టి.కోటేశ్వరరావు భార్య వసంత (58), బంధువు సాయికృష్ణ (35) తదితరులతో కలిసి సింహాచలంలో ఓ పెళ్లికి వచ్చారు. అక్కడి నుంచి గురువారం సాయంత్రం ఆర్కే బీచ్‌కు వెళ్లారు. ప్రమాదకరమని తెలియక స్నానం చేసేందుకు సముద్రంలో దిగారు. అలలు ఉధృతంగా రావడంతో వసంత, సాయికృష్ణ లోపలకు కొట్టుకుపోయారు. కళ్లెదుటే మునిగిపోతున్న వారిని రక్షించేందుకు అక్కడే ఉన్న ఒడిశాకు చెందిన గోవింద్ (26) యత్నించి, అతడు గల్లంతయ్యాడు. మరోవైపు లైఫ్‌గార్డులు కూడా బాధితులను కాపాడేందుకు సముద్రంలోకి దిగారు. మునిగిపోతున్న సాయికృష్ణను రక్షించి క్షేమంగా తీరానికి చేర్చారు. అయితే అప్పటికే కోటేశ్వరరావు భార్య వసంత మృతిచెందింది. గల్లంతైన గోవింద్ పెందుర్తిలోని ఓ రొయ్యల కంపెనీలో పనిచేస్తున్నట్టు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



పంద్రాగస్టు వేడుకలకు రంగం సిద్ధమయింది. ఇందులో భాగంగా కలెక్టరేట్ భవనాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

- హెల్త్ స్కీమ్ వర్తించినా అదనంగా వసూలు చేస్తున్న వైనం
- పట్టించుకోని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు
- సాధారణ, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారుతున్న ఆస్పత్రుల ఖర్చులు

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి డిశ్చార్జ్ అయ్యేంత వరకు అవసరం ఉన్నా లేకపోయినా అనేక పరీక్షలు చేయిస్తూ రోగుల వద్ద వీలైనంత లాగేస్తున్నాయి. ఇటీవల శ్రీకాకుళం జిల్లావాసి (45) ఒకరు అనారోగ్యంపాలై ప్రముఖ ఆస్పత్రికి వెళ్లారు. శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. రూపాయి ఖర్చు కాదని, హెల్త్ స్కీమ్‌లో ఉచితంగా చేస్తామన్నారు. దాంతో ఆయన శస్త్ర చికిత్స చేయించుకునేందుకు సిద్ధమయ్యారు. ముందురోజు వచ్చి ఆస్పత్రిలో చేరారు. కొన్ని గంటల ముందు పరీక్షలు నిర్వహించాల్సి ఉందంటూ రూ.15 వేలు కట్టించుకున్నారు. ఆ తరువాత శస్త్ర చికిత్సకు స్కీమ్‌లో ఇచ్చే పరికరాలు నాణ్యత ఉండవని, కొంత అదనంగా చెల్లిస్తే మన్నికైన ఇంప్లాంట్స్ వినియోగిస్తామని సిబ్బంది చెప్పారు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన రూ.30 వేల వరకు చెల్లించుకున్నారు. అలాగే జ్వరం, కళ్లు తిరగడం వంటి లక్షణాలతో చేరిన వ్యక్తిని మరో ఆస్పత్రి యాజమాన్యం అబ్జర్వేషన్ పేరిట రెండు రోజులు ఉంచి రూ.45 వేల వరకూ కట్టించుకుంది. పరీక్షల కోసం మరో రూ.10 వేలు లాగేశారు. ఇలా, నగర పరిధిలోని అనేక

... మిగతా 8వ పేజీలో



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కలెక్టర్‌కు కృష్ణాపురం రైతుల వినతి

పద్మనాభం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎంఎస్ఎంఈ పార్కునకు భూములు కేటాయించారని, ఈ విషయమై న్యాయం చేయాలని కృష్ణాపురం గ్రామ రైతులు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు. గురువారం వారు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నెంబరు 88, 93లో సుమారు 66 ఎకరాలను ఎంఎస్ఎంఈ పార్కునకు కేటాయించారన్నారు. ఈ భూముల్లో తాము 50 ఏళ్లుగా టేకు, నీలగిరి, జీడి చెట్లు పెంచుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ముందస్తు నోటీసులు గాని, గ్రామసభ గాని నిర్వహించకుండా భూములను పార్కునకు కేటాయించారన్నారు. తమకు న్యాయం చేసి, భూసేకరణ చట్టం-2013 ప్రకారం భూ కేటాయింపులు చేయాలని కోరారు.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం వాయిదా

మహారాణిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) :ఈనెల 16న జరగాల్సిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్ర మాన్ని 23వ తేదీకి వాయిదా వేసినట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. శనివారం పలు వేడుకలు, పండుగలు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. 23న నాలుగో శనివారం యథావిధిగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈమే రకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏఎంసీలో స్వాతంత్ర్య వీచిక

... 7వ పేజీ తరువాయి

సతీమణి చిట్టిజానకమ్మ వాల్తేర్‌లో కొంత భూమి, భవనాలు విరాళంగా ఇవ్వడంతో 1912లో పాఠశాలను అక్కడకు తరలించారు. అక్కడే ఆంధ్ర వైద్య కళాశాలగా ప్రారంభం కావడంతో తొలిసారిగా 32 మంది విద్యార్థులకు ప్రవేశాలు ఇచ్చారు. ఉత్తరాంధ్ర పరిసరాలకు చెందిన విద్యార్థులు ఎంబీబీఎస్ ఇంకా లైసెన్సియట్ ఎల్ఎంఎస్ కోర్సుల్లో చేరారు. అయితే కళాశాల నిర్వహణ పూర్తిగా ఆంగ్లేయులు రూపొందించిన నిబంధనల మేరకు నడిచేది. అప్పటికే స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా జరుగుతోంది. విద్యార్థులు పోరాటంలో పాల్గొనే అవకాశం ఉందని భావించిన ఆంగ్లేయ అధికారులు, సూటు, బూటు నిబంధన అమలుచేశారు. అయితే 1921 సెప్టెంబరు 28వ తేదీన వైద్య కళాశాలలో చదువుతున్న 142 మంది విద్యార్థులు సూటు, బూటును వదిలి స్వాతంత్ర్య పోరాటానికి సంఘీభావంగా గాంధీ టోపీలు, ఖాదీ వస్త్రాలు ధరించి తరగతులకు హాజరయ్యారు. ఇది ఒక్కసారిగా వైద్య కళాశాలలో కలకలం రేపింది. విద్యార్థులను ప్రశ్నించడంతో వారంతా ఎదురుతిరిగారు. డ్రెస్ కోడ్‌పై స్థానిక కోర్టులు విధించిన ఆంక్షల పట్ల నిరసన తెలిపారు. డ్రెస్ కోడ్ ఉల్లంఘనపై క్షమాపణ చెప్పాలని వైద్య కళాశాల అధికారులు ఆదేశించగా, 32 మంది నిరాకరించారు. దీంతో ఆ 32 మందిని వైద్య కళాశాల నుంచి తొలగించారు. ఈ విషయం దేశంలో స్వాతంత్ర్య ఉద్యమ నాయకులకు చేరింది. 32 మంది వైద్య విద్యార్థుల దేశభక్తిని మహాత్మాగాంధీ తన యంగ్ ఇండియా పత్రికలో అదే ఏడాది నవంబరు 24న ప్రస్తావించారు. 'దేశం దీర్ఘకాలిక బానిసత్వ వ్యాధితో బాధపడుతుంది. ఈ వ్యాధికి నిజమైన నివారణను కనుగొనేందుకు అంకితం చేసుకునే వారే నిజమైన సర్జన్లు, వైద్యులు అవుతారు. ఆ సార్వత్రిక వ్యాధి నయమైనప్పుడు ప్లేగు, కలరా, మలేరియా తదితర వ్యాధులు చాలావరకు అదృశ్యమవుతాయి.' అని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు ఏవీఎన్, సీబీఎం స్కూలు విద్యార్థులు సంఘీభావం తెలిపారు. ఈ ఘటనపై దేశంలో అనేక ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్తరాలను యంగ్ ఇండియాలో ప్రచురించడానికి గాంధీ అంగీకరించారని విశాఖలో స్వాతంత్ర్య పోరాటానికి ముందు నుంచి ఇటీవల జరిగిన అనేక మార్పులపై పరిశోధన చేసిన జాన్ కాస్టిల్ పేర్కొన్నారు. ఖాదీ దుస్తులు, టోపీ ధరించినందుకు సస్పెండైన 32 మంది వైద్య విద్యార్థులలో కొంతమందిని తరువాత చేర్చుకోగా, మరికొందరు వేరే కళాశాలలకు వెళ్లిపోయారు. ఇలా సస్పెండైన వారిలో నగరానికి చెందిన డాక్టర్ ఎంవీ కృష్ణారావు ఒకరు. ఆయన ఆంధ్ర వైద్య కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థి. వైద్య విద్య పూర్తిచేసి రాజకీయాల్లోకి వచ్చి మద్రాస్ రాష్ట్రంలో చక్రవర్తుల రాజగోపాలాచారి మంత్రివర్గంలో వైద్య, విద్య, హరిజన వెల్ఫేర్ (ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ) మంత్రిగా పనిచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యుడిగా 40 ఏళ్లు పనిచేశారు.

పీ-4కు 4,000 మంది మార్గదర్శకులు గుర్తింపు

... 7వ పేజీ తరువాయి

కుటుంబాలను మ్యాపింగ్ చేశామన్నారు. పెద్ద కంపెనీలకు ఎక్కువ స్థాయిలో బంగారు కుటుంబాలతో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 607 సచివాలయాల పరిధిలో కనీసం 10 మంది చొప్పున మార్గదర్శకులను గుర్తించే పని చురుగ్గా సాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 19వ తేదీన పీ-4 ప్రారంభం కానున్నదని, ఆలోగా మరింత మంది మార్గదర్శకులను గుర్తిస్తామన్నారు. నగరంలో ఇన్ ఆర్బిట్ మాల్ నిర్మిస్తున్న రహేజా గ్రూపు ఐటీ పార్కు అభివృద్ధికి పలుచోట్ల స్థలాలను పరిశీలించిందన్నారు. రుషికొండ ఐటీ హిల్స్ వద్ద 20 ఎకరాలు చూసిందన్నారు. కాగా, కాగ్నిజెంట్‌కు మధురవాడలో హరిత ప్రాజెక్టు పక్కన 22 ఎకరాలు, ఐటీ పార్కు అభివృద్ధి కోసం సిఫీ కంపెనీకి పరదేశిపాలెంలో 25 ఎకరాలు గుర్తించామన్నారు. ఇప్పటివరకూ ఐటీ కంపెనీలకు 100 ఎకరాలు కేటాయించామని వివరించారు. కాగ్నిజెంట్ సొంత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యేసరికి కొంత సమయం పడుతుందని, అప్పటివరకూ నగరం నుంచి కార్యకలాపాలు చేపట్టాలని యోచిస్తోందన్నారు. త్వరలో సుమారు రెండు వేల మందితో కార్యకలాపాలు ప్రారంభించేందుకు అద్దెకు భవనాలను అన్వేషిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు స్త్రీశక్తికి శ్రీకారం

... 7వ పేజీ తరువాయి

దూరం ఆధారంగా నిర్దేశించిన మేరకు టికెట్లు జారీ చేస్తారు. మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడకు ప్రయాణించినా జీరో టికెట్లు ఇస్తారు.

దూర ప్రాంతాలకు...

స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు ఉచితంగా వివిధ రూట్లలో దూర ప్రాంతాలకు కూడా రాకపోకలు సాగించవచ్చు. విశాఖ నుంచి విజయవాడకు మూడు ఎక్స్‌ప్రెస్‌లు, రాజమండ్రికి గంటన్నరకొకటి చొప్పున ఎక్స్‌ప్రెస్/మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. కాకినాడకు రెండు గంటలకొక ఎక్స్‌ప్రెస్/మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి.విజయనగరం, బొబ్బిలి, సాలూరు ప్రాంతాలకు గంటకొకటి, శ్రీకాకుళం, రాజాం, పాతపట్నం, టెక్కలి, సోంపేట ప్రాంతాలకు అరగంటకొకటి చొప్పున ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. వీటిలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

... 7వ పేజీ తరువాయి

ఆస్పత్రుల్లో పెద్దఎత్తున దోపిడీ జరుగుతున్నా ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

వసూళ్లే లక్ష్యం..

నగర పరిధిలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు వసూళ్లే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. తమ ఆస్పత్రులకు రోగులను తీసుకువచ్చేందుకు ప్రత్యేక టీమ్‌లను నియమించుకుంటున్నాయి. ఇందుకోసం ఆర్ఎంపీ, పీఎంపీలకు భారీగా కమీషన్లు ముట్టజెబుతున్నాయి. కొన్ని ఆస్పత్రులైతే రోగులు చెల్లించే మొత్తంలో కొంత పర్సంటేజీ ఇస్తున్నాయి.

'లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి'

మహారాణిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తోట వాసుదేవరావు కోరారు. గురువారం ఆయన మహారాణిపేటలో విలేకరులతో మాట్లాడారు.



నిరుపయోగంగా ఉన్న మునిసిపల్ చౌల్ట్రీ



భవనం చుట్టూ పేరుకుపోయిన పొదలు

శిథిలావస్థలో మునిసిపల్ చౌల్ట్రీ

- కొన్నేళ్లుగా నిర్వహణ కరువు
- పేరుకుపోయిన తుప్పలు, పొదలు

భీమునిపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మునిసిపల్ చౌల్ట్రీ శిథిలమైపోతోంది. భవనం చుట్టూ తుప్పలు పేరుకుపోవడంతో పాముల భయం వెంటాడుతోంది. 17వ శతాబ్దంలో భీమిలి డచ్ పోర్టు సిటీగా ఉండేది. అప్పట్లో ఇక్కడి నుంచి నౌకా వాణిజ్య వ్యాపారాలకు ఎన్నో ట్రేడింగ్ కంపెనీలు ఉండేవి. వాటిలో మద్రాస్ చెట్టియార్ల కుటుంబీకులు భీమిలి డచ్ పోర్టు ద్వారా వ్యాపారం సాగించేవారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో శత్రు దేశాల ఎయిర్ రైడ్స్ నుంచి రక్షణలో భాగంగా భారత ప్రభుత్వం దీన్ని మూసివేసింది. ఆ సందర్భంలోనే భీమిలి పోర్టును కూడా మూసివేశారు. అనంతరం మద్రాస్ చెట్టియార్లు ఇక్కడి నుంచి మద్రాస్ వెళ్లిపోతూ భవనాన్ని చౌల్ట్రీగా నిర్వహించాలని భీమిలి పురపాలక సంఘానికి అప్పగించారు. పురపాలక సంఘం ఈ భవనాన్ని చౌల్ట్రీగా చాలాకాలం నిర్వహించింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రీకులకు ఇక్కడ తక్కువ అద్దెకు బస చేయడానికి అవకాశం కల్పించేవారు. ఆ తర్వాత ఈ భవనంలో కొన్నాళ్లు ఈసేవా కేంద్రం నిర్వహించేవారు. గత ప్రభుత్వంలో ఈ సేవా కేంద్రాలను మూసివేయడంతో మళ్లీ భవనం నిరుపయోగమైంది. మేడపై ఉన్న గదిని కొంతకాలం భీమిలి తాలూకా పెన్షనర్ల అసోసియేషన్ లీజుకు తీసుకుంది. వారిని కూడా ఖాళీ చేయించేశారు. ప్రస్తుతం అయిదేళ్లుగా భవనం నిరుపయోగంగా ఉంది.

భీమిలిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

భీమునిపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బీచ్ రోడ్డులో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ర్యాలీని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు భారతదేశం మ్యాప్ ఆకృతిలో ఏర్పడి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే జోనల్ కార్యాలయం సిబ్బంది, పారిశుధ్య కార్మికులు కూడా తిరంగా ర్యాలీ నిర్వహించారు. చిన్నబజారు జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఈ ర్యాలీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జోనల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బీఎం నాయుడు, పబ్లిక్ హెల్త్ మేస్త్రి రేగాని రవి, సురేశ్, మనోజ్, త్రివేణి, శివ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ



దుకాణదారుడితో మాట్లాడుతున్న ఆర్‌డీఓ సంగీత్ మాథూర్

మూడు దుకాణాలపై 6ఏ కేసులు

తగరపువలస, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో వెల్డింగ్ దుకాణంలో పేలుడు జరిగిన నేపథ్యంలో భీమిలి ఆర్‌డీఓ కె.సంగీత్ మాథూర్ గురువారం తగరపువలస, భీమిలి రూరల్ మండలంలోని పలు వెల్డింగ్ దుకాణాలను తనిఖీ చేశారు. జీవీఎంసీ, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల సిబ్బందితో సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. తగరపువలసలోని మూడు దుకాణాల్లో ఇళ్లకు ఉపయోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించి 6ఏ కేసు నమోదు చేసి, ఆయా షాపులను సీజ్ చేశారు. అలాగే రెండు రెస్టారెంట్లలో వాణిజ్యపరమైన గ్యాస్ కాకుండా గృహోపకరణానికి ఉపయోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించి కేసులు నమోదు చేశారు.

అన్నప్రసాదానికి దాతల ఉదారతే కీలకం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అధికారులు

సింహాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి దాతల ఉదరతే కీలకమని దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె. తిరుమలేశ్వరరావు అన్నారు. అన్నప్రసాద పథకం ప్రారంభించి గురువారం నాటికి 36 ఏళ్లు పూర్తి కావడంతో భక్తులకు ఆయన అధికారులతో కలిసి అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవస్థానం ఉద్యోగులు తొలి విరాళంతో ప్రారంభమైన ఈ పథకానికి ఇప్పటివరకు వేలాది మంది దాతలు ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం ఏఈఓ రమణమూర్తి, పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావు,సిబ్బంది రేవతి, కాశీ, డీఈఈ ఎస్. సన్యాసిరావు (తాతాజీ), పీఆర్ఓ డి. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



ఆలయ సన్నిధిలో సింహాద్రి లయన్స్ జట్టు సభ్యులు

సింహాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామిని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో పాల్గొంటున్న సింహాద్రి లయన్స్ జట్టు సభ్యులు గురువారం దర్శించుకున్నారు. వారికి దేవాలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

అవయవ దానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 14, (ఆంధ్రజ్యోతి): అవయవదానం చేస్తే మరో వ్యక్తికి ప్రాణదానం చేసినట్టేనని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ వరకు గురువారం అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎంతోమంది కిడ్నీ, లివర్, హార్ట్ తదితర అవయవాలు పాడై దాతల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వారి ప్రాణాలు కాపాడేందుకు అవయవదానమే పరిష్కారమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు



గంభీరంలో శ్రీకృష్ణ మండపం

ఆనందపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ వైకుంఠం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 వరకు భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఒకేసారి రెండు వేల మంది దర్శించుకునేందుకు, సంకీర్తన చేయడానికి వీలుగా విశాలమైన వేదిక సిద్ధం చేస్తున్నారు. అలాగే ఒకేసారి వెయ్యి మందికి ప్రసాద వితరణ చేయడానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. 108 పలకలతో హరినామ జప మండపం నిర్మించారు.16న రాత్రి 12 గంటలకు స్వామివారికి మహా అభిషేకం, మంగళ హారతి నిర్వహించనున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

భీమునిపట్నం : పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు శివ, కేశవ ఆలయాల సముదాయం ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆర్. సింగరాచార్యులు తెలిపారు. శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ప్రత్యేక పూజలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చిన్నారులకు వేషధారణ పోటీలు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా చిన్నారులకు శనివారం శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడేళ్లలోపు వారు ఒక విభాగంగా, నాలుగు నుంచి ఆరేళ్లలోపు ఒక విభాగం, ఏడు నుంచి తొమ్మిదేళ్లలోపు, 10 నుంచి 12 ఏళ్లలోపు వారికి మరో విభాగంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు 9866067849, 9989723359, 9392881065 ఫోన్ నంబర్లను సంప్రతించాలని వారు సూచించారు.

పాలిథిన్ కవర్లు స్వాధీనం

భీమునిపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోన్ మూడో డివిజన్ పరిధిలోని పలు దుకాణాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బీఎం నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం తనిఖీ చేశారు. ఈమేరకు ఐదు కిలోల పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుని, వాటిని వినియోగిస్తున్న దుకాణదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్ మేస్త్రి రవి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వీసీబీలో వైద్య శిబిరం



మధురవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంకు మధురవాడ శాఖ 15వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం మిథిలాపురి వుడాకాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాంకు అధ్యక్షుడు జేవీ సత్యనారాయణమూర్తితో పాటు సభ్యులు, ఖాతాదారులకు పినాకిల్ ఆస్పత్రి, మాక్సివిజన్ నేత్ర వైద్యశాల, క్లోవ్ డెంటల్ ఆసుపత్రి వైద్యు లు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 2010 ఆగస్టు 14న మధురవాడ బ్రాంచి ప్రారంభమైందన్నారు.15 ఏళ్లలో రూ.200 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిపిందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జోనల్ మేనేజర్ ఎం. సత్యనారాయణ, మధురవాడ శాఖ మేనేజర్ అప్పారావు, కమి టీ సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రపు డెక్కతో ఇబ్బందులు



అన్నవరం తీరంలో గుర్రపు డెక్క

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో గుర్రపుడెక్క పొదుల వల్ల మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. అన్నవరం, నాగమయ్యపాలెం, పెదనాగమయ్యపాలెం, ఎర్రయ్యపాలెంలో కెరటాలను ఆనుకుని గుర్రపు డెక్క పొదులు విపరీతంగా ఉన్నాయి. వీటి వల్ల ఇసుకలో నుంచి పడవలను సముద్రంలోకి తీసుకువెళ్లడం ఇబ్బందిగా ఉంటుందని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు..

నేడు దంత వైద్య శిబిరం

భీమునిపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కలిగొట్ల స్నిగ్ధశ్రీ జయంతి పురస్కరించుకుని శుక్రవారం చిన్నబజారులోని డచ్‌రోడ్‌లో వున్న ఆ సంస్థ కార్యాలయంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ద డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రముఖ దంత వైద్యులు కావలిపురపు వెంకట తేజ, కేవీ అపూర్వ వసుంధర వైద్య సేవలందిస్తారన్నారు.

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పాల మధ్య స్వామివారు

సింహాచలం, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి) : వరాహల క్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడా మండప ప్రదక్షిణ చేశారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ సంపెంగలతో పూజలు జరిపారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

పాండ్రంగిలో ఉధృతంగా గోస్తనీ నది



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి, ఇతర అధికారులు

పద్మనాభం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల వరద నీరు వచ్చే ప్రమాదం ఉండడంతో ముందస్తుగా పాండ్రంగి గోస్తనీ నదిపై ఉన్న కాజువేపై రాకపోకలు నిలిపివేయాలని మండల ప్రత్యేకాధికారి కె. జ్ఞానవేణి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కాజువే ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. కాజువేపై రాకపోకలు నిషేధించి, బోని గ్రామం మీదుగా రాకపోకలు సాగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్యం, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. నది వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, రాత్రి గస్తీ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దారు కె. ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

తాటితూరు హైస్కూల్‌కు కుర్చీల వితరణ

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన సాడి పార్వతమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు బాంబరెడ్డి పది కుర్చీలను వితరణగా అందించారు. వాటిని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశ్వరరావుకు గురువారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బి. సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రసాదరావు సూర్య, లలిత, గంగరాజు, కుమార్ పాల్గొన్నారు.

11వ వార్డులో సామాజిక భవనం ప్రారంభం


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 11వ వార్డులోని ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి అనువుగా తీర్చిదిద్దిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ 11 వార్డులో ప్రజల అవసరాలు తీర్చే విధంగా సామాజిక భవనాన్ని నిర్మించిన్ను చెప్పారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఆప్సరా కాలనీ-2లో ప్రజల దాహార్తిని తీర్చేదుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు.

ఈ కార్యక్రమాల్లో టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, కార్యదర్శి పేపరు నాయుడు, నేతలు శ్రీనివాసరావు, మూది అప్పారావు, రేఖా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడు చూసినా.. గేజ్ 3లోనే

» మరమ్మతుకు నోచుకోని సింహాద్రిపురం వాటర్ పంప్‌హౌస్


సింహాద్రిపురం వాటర్ పంపు హౌస్ వద్ద పనిచేయని వాటర్ గేజ్

వెంకోజీపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు హెచ్‌బీకాలనీ వద్ద ఉన్న సింహాద్రిపురం వాటర్ పంప్‌హౌస్ వాటర్ ట్యాంకు వద్ద నీటి నిల్వను తెలియజేసే వాటర్ గేజ్ పని చేయడం లేదు. ఎప్పుడూ వాటర్ గేజ్ ముళ్లు 3 వద్దే ఉన్నట్టు కనిపిస్తుంటుంది. దీంతో ట్యాంకులో నీటి నిల్వ ఎంత ఉందో తెలుసుకోవాలంటే.. ఇక్కడ పనిచేసే పైపు లైనులో నీటిని విడుదల చేసే లైన్‌మన్ ట్యాంకు పైకి ఎక్కి తెలుసుకోవాల్సి వస్తోంది. దాదాపు రెండేళ్ల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉందని లైన్‌మన్ చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాటర్ గేజ్ మరమ్మతు చేపట్టాలని నిర్వాహకులు కోరుతున్నారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 24, బీరకాయలు 18, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46,దొండకాయలు 26, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

చిరు వ్యాపారుల దెబ్బకు చిన్నబోతున్న రహదారులు

» రైతు బజార్ వద్ద నిత్యం ట్రాఫిక్ కష్టాలు » రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండడంతో రద్దీ » పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు


సరుకుల కొనుగోలు కోసం రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ రైతు బజార్‌కు రెండు వైపులా ఉన్న రహదారులపై చిరు దుకాణాలు వెలియడంతో రోడ్డు ఇరుకుగా మారి పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మధ్య చక్కగా రోడ్డు నిర్మించారు. ఈ విషయంలో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే రహదారిని ఆనుకుని ఉన్న చిరు దుకాణాల వారు మరింతగా ముందుకు వచ్చి, రహదారిని ఆక్రమిస్తున్నారు. కొనుగోలుదారులు కూడా తమ వాహనాలను అక్కడే నిలిపి బేరసారాలు ఆడుతుండడంతో అటుగా ప్రయాణించే వారికి చాలా ఇబ్బంది ఎదురవుతోంది. పాదచారులైతే నడవలేని పరిస్థితి ఎదురవుతోంది. ఉదయం, సాయంత్రం రైతు బజార్ సాధారణ రోజుల్లోనే రద్దీగా ఉంటుంది. ఆదివారం, పండుగల రోజుల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

అయితే చిరు వ్యాపారాలను చేసుకుంటున్న వారిని తొలగించడం వల్ల వారి ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉందని భావిస్తే కనీసం వారిని కాస్తా లోపలకు తమ వస్తువులను ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు. అలాగే కొనుగోలుదారులు వాహనాలను అక్కడ నిలపకుండా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొద్ది రోజుల కిందట జీవీఎంసీ కమిషనర్ అన్న క్యాంటీన్ పరిశీలనకు వచ్చినప్పుడు రోడ్డుపైకి దుకాణాలు రాకుండా చూడాలంటూ అధికారులను ఆదేశించారు. అయితే గ్రేటర్ కమిషనర్ ఆ ఆదేశాలు అమలులోకి రాలేదు. ఏ ఒక్క అధికారీ కూడా అందుకు చర్యలు తీసుకోలేదు. కనీసం ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

వినాయక నవరాత్రులకు పందిరి రాట


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో అయిదో సెక్టరులో ప్రతి యేటా నిర్వహించే విధంగా ఈ ఏడాది కూడా వినాయకచవితి ఉత్సవాలను ఘనంగా చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందుగా పంది రాట పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు చోడె పట్టాభిరాం, కాళ్ల శంకర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాపురంలో కొండచిలువ కలకలం



ఆరిలోవ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాపురంలో బుధవారం అర్ధరాత్రి కొండచిలువ కలకలంసృష్టించింది. ఇది జన సంచారంలోకి వచ్చింది. దీన్ని చూసి స్థానికులు భయభ్రాంతులకు లోనయ్యారు. స్థానికుడు మారికి జక్కన్న ఈ కొండచలువను చాకచక్యంతో పట్టుకొని దగ్గరలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలకు భారీ సన్నాహాలు


వేడుకలకు ముస్తాబు అవుతున్న వేదిక

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శుక్ర, శని, ఆదివారాల్లో ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించనున్న కృష్ణాష్టమి వేడుకలకు హరేకృష్ణ మూవ్‌మెంట్ భారీ సన్నాహాలు చేస్తోంది. మూడు రోజుల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, సాయంత్రం 5 నుంచి 9 వరకూ భక్తులకు దర్శనం ఉంటుంది. 108 పలకలతో హరినామ జపమండపం ఏర్పాట్లు చేస్తున్నారు. 16న రాత్రి 9.30కి మహా అభిషేకం, పన్నెండు గంటలకు మంగళహారతి నిర్వహించనున్నారు. సప్తనదుల్లో సేకరించిన జలంతో, 108 పవిత్ర జల కలశాలలు, పండ్లరసాలు, పంచామృతం, పంచంగవ్యాలు, వివిధ పుష్పాలతో మహాభిషేకం నిర్వహిస్తారు. బాలగోపాలుడికి ఊయల సేవ, ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టడం, కృష్ణుడితో సెల్ఫీ, చిత్రాలలో తేడాలను గుర్తించడం, కృష్ణుడు ఎవరు అనే అంశంపై పరీక్ష వంటి పోటీలు కూడా నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధి యుదురాజా దాస తెలిపారు. చివరి రోజు వ్యాస పూజ, నందోత్సవం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

వాల్తేరు ఫొటోగ్రఫిక్ సొసైటీ రజతోత్సవ పోస్టర్ విడుదల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుమన్ కలగర్, ఫొటోగ్రఫీ సొసైటీ సభ్యులు

పెదవాల్తేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని, వాల్తేరు ఫొటోగ్రఫిక్ సొసైటీ 25వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 19, 20వ తేదీల్లో నిర్వహించనున్న రజతోత్సవ సంబరాల పోస్టర్‌ను గురువారం విజయ మెడికల్ సెంటర్ సెమినార్ హాలులో విజయ మెడికల్ సెంటర్ ఎం.డి. డాక్టర్ సుమన్ కలగర్ సొసైటీ సభ్యులతో కలిసి అవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి ఎంవీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 19వ తేదీన ఆంధ్రవిశ్వకళాపరిషత్ హిందీ విభాగం సెమినార్ హాలులో సుమారు వెయ్యి ఫొటోలతో ఫొటో ప్రదర్శన మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనంతరం నృత్య ప్రదర్శన, వాల్తేరు ఫొటోగ్రఫీ సొసైటీ అద్వర్యంలో 2000లో ఆవిర్భవించిన దగ్గర నుంచి ఫొటో ప్రదర్శనలు, ఉచిత ఫొటోగ్రఫీ మీద వర్క్ షాపులు, ఫొటోషూట్లు నిర్వహిస్తామన్నారు. అలాగే పురాతన కెమెరాలు ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు, ప్రతినిధులు జగపతిరాజు, ఎస్.శ్రీనివాసరావు, సతీష్‌కుమార్, వేణుగోపాలరావు, కేఎంకే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశమే ముఖ్యం నినాదంతో ముందుకు సాగాలి

» ఏయూ విద్యావిభాగాధిపతి టి.షారోన్ రాజు


హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విశాఖపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : దేశాభ్యున్నతి, వికాసం ప్రధాన లక్ష్యంగా యువత ముందుకు సాగాలని ఏయూ విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. ఏయూలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరూ దేశ సమగ్రతకు కృషి చేస్తూ అభివృద్ధి చోదక శక్తిగా మారాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు తివర్ణ పతాకాన్ని చేబూని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. విభాగ ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ మూర్తి డాక్టర్ ప్రవీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్లూప్రింట్ ఫర్ అకడమిక్ అండ్ కెరీర్ ఎక్సలెన్సీపై ఏయూలో సదస్సు


ముఖ్యవక్తలను సన్మానించిన ఏయూ విభాగాధిపతులు

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో గురువారం ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ వుమెన్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బ్లూ ప్రింట్ ఫర్ అడకమిక్ అండ్ కెరీర్ ఎక్సలెన్సీ-2025 అంశంపై ఒక రోజు సెమినార్‌ను గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, మెకానికల్ విభాగం హెచ్‌వోడీ ఆర్.మధుసూదనరావు సెమినార్‌ను ప్రారంభించారు. ఆర్. సత్యికా సైయెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ హైదరాబాద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్, సీటెక్ ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ ఉపాధ్యక్షులు, ఎన్ఎస్‌టీఎల్ మాజీ శాస్త్రవేత్త ముఖ్యవక్తలుగా పాల్గొన్నారు. ప్రారంభ సెషన్‌కు ఆచార్య ఆర్.మధుసూదన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి 150 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వివిధ విభాగాధిపతులు ఆచార్యులు ప్రజ్ఞ, అన్నపూర్ణ, డాక్టర్ అరుణ, డాక్టర్ శిరీష పాల్గొనిముఖ్యవక్తలను సత్కరించారు.

వర్షాల సమయంలో ముందస్తు జాగ్రత్తలు అవసరం

» అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



వెంకోజీపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున జీవీఎంసీ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను గురువారం ఆదేశించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే వర్షాలు పడే సమయంలో లోతట్టు, కొండవాలు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితిలో అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జోనల్ స్థాయిలో లోతట్టు, కొండవాలు ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో వర్షాలు వల్ల ఎదురయ్యే ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించామన్నారు. అధికారులు అన్ని సామాజిక భవనాలను తనిఖీలు నిర్వహించి అందులో గల సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలలో ప్రజలు లేకుండా చూడాలని ఆదేశించారు. నగర పరిధిలో అన్ని మ్యాన్‌హోల్స్‌ను సురక్షిత మూతలతో కప్పి ఉండేలా చూడాలని, ప్రజల తాగునీటికి ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని, నీరు కలుషితం జరగకుండా నాణ్యత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. వీధి దీపాల నిర్వహణతో పాటు వాటి లోపాలను సరిదిద్ది అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలన్నారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియపరిచి వారి సహకారం తీసుకోవాలని సూచించారు. వర్షాలు, గాలుల వల్ల చెట్లు కూలే ప్రమాదం ఉన్నందున కూలిన చెట్లను వెనువెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, ఎండిన లేదా బలహీనంగా ఉన్న చెట్లను తొలగించాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు. అనధికార పాత పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్లు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కాలువలలో పూడికలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అన్ని జోనల్ స్థాయి అధికారులు జోనల్ కంట్రోల్ రూమ్స్‌లో 24 గంటలూ అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, అత్యవసర పరిస్థితిలో జీవీఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్‌ను సమాచార కేంద్రంగా వినియోగించుకోవాలని సూచించారు. నగర ప్రజలు వర్షాలు పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాల వద్ద, చెట్ల కింద, పాత భవనాల వద్ద హోర్డింగులు వద్ద, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండరాదని, సురక్షిత, ప్రాంతాలకు వెళ్లాలని, అధికారులు సూచించిన ప్రదేశాలలో ఉండాలని కమిషనర్ ప్రకటన ద్వారా తెలియజేశారు.

రూ.5.5 లక్షలతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఆధునికీకరణ

» సీపీ శంఖబ్రత బాగ్చి


ఆధునీకరించిన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న పోలీసు అధికారులు

మద్దిలపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మరమ్మత్తులకు గురైన మూడోపట్టణ పోలీస్‌స్టేషన్ ను రూ. 5.50 లక్షలతో ఆధునీకరించినట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చెప్పారు. ఆధునీకరించిన మూడోపట్టణ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 1989లో నిర్మించిన మూడోపట్టణ పోలీస్‌స్టేషన్ భవనం 35 ఏళ్లు గడిచినా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారిందన్నారు. శ్లాబ్‌లు పెచ్చులూడిపోయి వర్షం వస్తే నీరు లీక్ అవడం, బీటలు వారిన గోడలతో ఉండేదన్నారు. అందుకే వెంటనే త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ భవనాన్నిమరమ్మత్తులు చేపట్టాలని పోలీస్ సౌజన్య కార్పొరేషన్, ఏఆర్ ఏడీసీపీలకు ఉత్తర్వులివ్వగా పనులు పూర్తి చేశారన్నారు. శ్లాబ్‌లు, గోడలకు మరమ్మత్తులు చేసి, రంగులు వేశారన్నారు. మెట్లకు స్టీల్ రైలింగ్, ఎలాక్ట్రికల్ పనులు చేసి మరో పదేళ్ల భవనం లైఫ్‌ను పెంచామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, శ్రీకృష్ణకాంత్ పటేల్, కె.లతామాధురి, ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ పైడయ్య పాల్గొన్నారు.

ఇగ్నో ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా



జాతీయ జెండాలతో డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో బాగంగా నగరంలోని అధ్యయన కేంద్రాల్లో గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించింది. కేజీహెచ్ ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, జైలు రోడ్డులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇగ్నో ప్రాంతీయ సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఇగ్నో అదనపు సంచాలకులు డాక్టర్ కృష్ణారావు పర్యవేక్షించారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలి

» రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, అనిత

రామ్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ పోటీ ప్రపంచంలోవిద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగల పూడి అనిత అన్నారు. విశాఖలో సుమారు 5400 మంది ఆదిత్యా కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాలు సాధించిన నేపథ్యంలో గురువారం ఏయూ కాన్వొకేషన్ సమావేశ మందిరంలో ఆదిత్యా అచీవర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హోంమంత్రి అనితతో పాటు విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఆదిత్యా విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి సుగుణా రెడ్డి, బీఈవీఎల్ నాయుడు, పి.రామకృష్ణారెడ్డి, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

సీతమ్మధారలో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, నవోదయ విద్యాసంస్థల అధినేతలు

సీతమ్మధార, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గం పరిధి సీతమ్మధార మండలంలో తిరంగ యాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో నవోదయ విద్యా సంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జాతీయ పతాకంతో ముందుకు సాగారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేతలు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు సురేష్‌బాబు, నానాజీ, అనంత్, రవి కుమార్, మాదేటి కనకరావు, రాజు, రామరాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న దేశ భక్తి ఉత్సాహాన్ని నింపారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా

» బీజేపీ ఆధ్వర్యంలో భారీ జెండాతో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక, ఆ పార్టీ నేతలు



భారీ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, జీవీఎంసీ హైస్కూలు విద్యార్థులు

మాధవధార, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) ; విశాఖ ఉత్తరంలోని బీజేపీ 50వ వార్డు అధ్యక్షుడుకూన వెంకటరావు అధ్వర్యంలో గురువారం భారీ హమ్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ హైస్కూలు విద్యార్థులు ర్యాలీలో పొడవైన జాతీయ జెండాను చేబూని 'జైహింద్.. జై భారత్' నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామలాదీపిక, బీజేపీ యువ నాయకుడు సునీల్ అగర్వాల్ హాజరయ్యారు. జీవీఎంసీ మాధవధార హైస్కూలు హెచ్‌ఎం బి.హేమలత, టీచర్స్ ప్లకార్డులు పట్టి భారత స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కూన వెంకటరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై పాల్గొన్న బాలలకు అభినందనలు తెలిపారు. విద్యార్థి దశ నుంచే దేశ భక్తి, పెద్దలను గౌరవించే మన సంస్కృతిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. సమైక్యతను చాటి చెప్పే స్వాతంత్ర్య సంబరాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని దేశ గొప్పదనాన్ని చాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు హాజరయ్యారు.

200 అడుగుల త్రివర్ణ పతాకాంతో ర్యాలీ

అక్కయ్యపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రేటర్ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు 200 అడుగుల త్రివర్ణ పతాకంతో గురువారం సాయంత్రం పెరేడ్ నిర్వహించారు. పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీని ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి ప్రారంభించారు. ఈ ర్యాలీ పాఠశాల ప్రాంగణం నుంచి అక్కయ్యపాలెం వేణుగోపాలస్వామి ఆలయం, మహారాణి పార్లర్ జంక్షన్ మీదుగా పాఠశాల వరకు సాగింది. ఈ ప్రాంతమంతా 'భారత్ మాతాకీ జై' నినాదంతో మార్మోగింది. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు యాఎన్ రత్నం, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, శ్యామల, గ్లోరీ, హేమ తదితరులు పాల్గొన్నారు.



200 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు

విద్యార్థులు నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ విద్యార్థులు

కంచరపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కూడిన నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ పేర్కొన్నారు. కళాశాలలో ఇన్ఫోసిస్ సహకారంతో చేపట్టిన నైపుణ్య శిక్షణ వ్యాలిడేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు చి.అప్పారావు మాట్లాడుతూ .విద్యార్థులు శిక్షణలో చేర్చుకున్న నైపుణ్యాలను ఉద్యోగ జీవితంలో వినియోగించి ఉన్నతికి చేరుకోవాలన్నారు. ఉన్నతి ఫౌండేషన్ ట్రైనర్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, జీవన నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులు శిక్షణలో పొందిన మెలకువలతో ప్రదర్శించిన నాటికలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డా.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్వీ కుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతతో డిజైన్ కనెక్ట్ 2025

సీతంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డిజైనర్స్‌లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారి ప్రతిభను చాటి చెప్పే విధంగా డిజైన్ కనెక్ట్ 2025 కార్యక్రమాన్ని ఇకో థీమ్‌తో నిర్వహిస్తున్నట్టు ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ (ఐఎస్ఎస్‌డి) ప్రతినిధులు నిర్మాణ్ ఆర్కిటెక్ట్ బి.సురేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ హేమ సుందర్, డైరెక్టర్ అమృత పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల ఐఎస్ఎస్‌డీ సంస్థలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ డిజైన్ కనెక్ట్ 2025ని సెప్టెంబర్ 20వ తేదిన పోర్టు స్టేడియంలో గల విశ్వనాథ స్పోర్ట్స్‌లో పలువురు డిజైనర్స్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి సృజనాత్మక మేధావులు ఒక చోట చేర్చి కళాత్మకమైన దుస్తుల కలెక్షన్లు, ఆంధ్ర ప్రాంతపు హస్తకళలు డిజైన్ కనెక్ట్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు, ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకుడు వీరు మామ చేతుల మీదుగా డిజైన్ కనెక్ట్ 2025 పోస్టర్‌ని ఆవిష్కరించారు.

వుడా భూసేకరణ లబ్ధిదారుల నుంచి ప్లాట్లు కొని ఇబ్బందులు

» కూటమి ప్రభుత్వం చొరవ చూపి న్యాయం చేయాలని వుడా ప్లాట్ ఓనర్స్ సంఘం వినతి

సీతంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) :వుడా భూసేకరణ లబ్ధిదారుల నుంచి కొన్ని సంవత్సరాల క్రితంప్లాట్లు కొనుగోలు చేసి మోసపోయామని, మా గోడును ప్రజా ప్రతనిధులు, వుడా అధికారులకు విన్నవించుకున్నామని, న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చొరవ చూపి చర్యలు చేపట్టాలని వుడా ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పీలా అప్పలనాయుడు, సీతారామరాజు, దత్తిరాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భూసేకరణ పద్ధతిలో 2009 నుంచి 2011 మధ్య కాలంలో అప్పట్లో వుడా సంస్థ రుషికొండ, మధురవాడ, కొమ్మాది, ఓజోన్ వ్యాలీ ప్రాంతాల్లో భూసేకరణ చేసి భూమి కోల్పోయిన రైతులకు 750 చదరపు గజాలు డెవలప్ సైట్ సర్వే నెంబరు 34, 35 (రుషికొండ)లో భూమి కేటాయించిందని తెలిపారు. ఈ విధంగా వుడా రైతులకు కేటాయించిన 450 సైట్లను పలువురు కొనుగోలు చేయడం, అమ్మడం కూడా జరిగిందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ ప్లాట్లకు నీరు, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ సదుపాయాలుకల్పించకుండా వదిలేశారన్నారు. సంవత్సరాల తరబడి వుడా తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు చుట్టూ తి రుగుతున్నా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసి ప్లాట్లు చెల్లవంటూ 2012లో వుడా అధికారులతో కుమ్మక్కై రైతులు ప్లాట్లు పొందారని ప్రకటన వెలువడించారన్నారు. 75 శాతం ప్లాట్లు రైతులు వేరే వారికి విక్రయించారని, కొనుగోలు చేసిన ప్లాట్లలో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ప్లాట్లు చెల్లవన్న ప్రకటన గురించి అధికారులకు అడిగితే 2014లో విజిలెన్స్ విచారణ చేపట్టి రైతులకు ప్లాట్ల కేటాయింపు చెల్లదని చెప్పిందన్నారు. వీఎంఆర్డీఏగా మారిన తర్వాత తమకు న్యాయం చేయాలని అడిగితే 2009-2011 రికార్డులుతమ వద్ద లేదని తప్పించుకుంటున్నారన్నారు. తమకు న్యాయం చెయ్యాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకు వెళ్ళగా తమకు హామి ఇచ్చి అసెంబ్లీలో తమ సమస్యను ప్రస్తావించారని తెలిపారన్నారు. అసెంబ్లీ చర్చ జరిగి అయిదు నెలలు గడిచినా తమకు న్యాయం జరగలేదన్నిప్రభుత్వంచొరవ తీసుకొని న్యాయంచేయాలనికోరుతున్నామన్నారు.

రైల్వే స్టేషన్‌లో దేశ విభజన నాటి ఫొటో ప్రదర్శన ప్రారంభం



.ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, రైల్వే అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ రైల్వే స్టేషన్‌లో దేశ విభజన సమయంలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను వర్ణించిన ఛాయాచిత్రాలతో వాల్తేరు డివిజన్ ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా గురువారం ప్రారంభించారు. దేశ విభజన భయానక స్మారక దినోత్సవంగా పేర్కొనే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఛాయా చిత్రాల ప్రదర్శను డీఆర్ఎం తిలకించారు. దేశ విభజన సమయంలో లక్షలాది కుటుంబాల స్థానభ్రంశం చెంది ఎదుర్కొన్న కష్టాలను వర్ణించే ఉత్తేజకరమైన చిత్రాలను చూసి అమర వీరులు, బాధితులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాడీఆర్ఎం మాట్లాడుతూ దేశ విభజనకు ముందు లక్షలాది మంది ప్రజల విషాద ఘటనలు, త్యాగాలు, భావోద్వేగాల జ్ఞాపకార్థంగా విభజన భయానక స్మారక కార్యక్రమం జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు చారిత్రక బాధలు, త్యాగాలు తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. వలసల సమయంలో స్థానభ్రంశం చెందిన సమయంలో ఏర్పడిన కల్లోలం, నష్టం ఎప్పటికీ మరుపురాని చేదు దృశ్యాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీపీవో కబీర్ అన్సారి, సీనియర్ డీసీఎం కె.సందీప్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి ద్వారకానగర్‌లో ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద ఫుట్‌పాత్‌పై ఒక గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో ఆ వ్యక్తిని 108 అంబులెన్స్‌లో మంగళవారం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేపట్టారు. మృతదేహన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు, బంధువులు ఎవరైనా ఉంటే ద్వారకా పోలీసు స్టేషన్ లేదా పోలీసు స్టేషన్ ఫోన్ : 63051870009లో సంప్రదించాలని కోరారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

... 7వ పేజీ తరువాయి

ఆస్పత్రుల్లో పెద్దఎత్తున దోపీడీ జరుగుతున్నా ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

వసూళ్లే లక్ష్యం..

నగర పరిధిలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు వసూళ్లే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. తమ ఆస్పత్రులకు రోగులను తీసుకువచ్చేందుకు ప్రత్యేక టీమ్‌లను నియమించుకుంటున్నాయి. ఇందుకోసం ఆర్ఎంపీ, పీఎంపీలకు భారీగా కమీషన్లు ముట్టజెబుతున్నాయి. కొన్ని ఆస్పత్రులైతే రోగులు చెల్లించే మొత్తంలో కొంత పర్సంటేజీ ఇస్తున్నాయి.

నేడు స్త్రీశక్తికి శ్రీకారం

... 7వ పేజీ తరువాయి

దూరం ఆధారంగా నిర్దేశించిన మేరకు టికెట్లు జారీ చేస్తారు. మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడకు ప్రయాణించినా జీరో టికెట్లు ఇస్తారు.

దూర ప్రాంతాలకు...

స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు ఉచితంగా వివిధ రూట్లలో దూర ప్రాంతాలకు కూడా రాకపోకలు సాగించవచ్చు. విశాఖ నుంచి విజయవాడకు మూడు ఎక్స్‌ప్రెస్‌లు, రాజమండ్రికి గంటన్నరకొకటి చొప్పున ఎక్స్‌ప్రెస్/మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. కాకినాడకు రెండు గంటలకొక ఎక్స్‌ప్రెస్/మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. విజయనగరం, బొబ్బిలి, సాలూరు ప్రాంతాలకు గంటకొకటి, శ్రీకాకుళం, రాజాం, పాతపట్నం, టెక్కలి, సోంపేట ప్రాంతాలకు అరగంటకొకటి చొప్పున ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. వీటిలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

పీ-4కు 4,000 మంది మార్గదర్శకులు గుర్తింపు

... 7వ పేజీ తరువాయి

కుటుంబాలను మ్యాపింగ్ చేశామన్నారు. పెద్ద కంపెనీలకు ఎక్కువ స్థాయిలో బంగారు కుటుంబాలతో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 607 సచివాలయాల పరిధిలో కనీసం 10 మంది చొప్పున మార్గదర్శకులను గుర్తించే పని చురుగ్గా సాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 19వ తేదీన పీ-4 ప్రారంభం కానున్నదని, ఆలోగా మరింత మంది మార్గదర్శకులను గుర్తిస్తామన్నారు.

నగరంలో ఇన్ ఆర్బిట్ మాల్ నిర్మిస్తున్న రహేజా గ్రూపు ఐటీ పార్కు అభివృద్ధికి పలుచోట్ల స్థలాలను పరిశీలించిందన్నారు. రుషికొండ ఐటీ హిల్స్ వద్ద 20 ఎకరాలు చూసిందన్నారు. కాగా, కాగ్నిజెంట్‌కు మధురవాడలో హరిత ప్రాజెక్టు పక్కన 22 ఎకరాలు, ఐటీ పార్కు అభివృద్ధి కోసం సిఫీ కంపెనీకి పరదేశిపాలెంలో 25 ఎకరాలు గుర్తించామన్నారు. ఇప్పటివరకూ ఐటీ కంపెనీలకు 100 ఎకరాలు కేటాయించామని వివరించారు. కాగ్నిజెంట్ సొంత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యేసరికి కొంత సమయం పడుతుందని, అప్పటివరకూ నగరం నుంచి కార్యకలాపాలు చేపట్టాలని యోచిస్తోందన్నారు. త్వరలో సుమారు రెండు వేల మందితో కార్యకలాపాలు ప్రారంభించేందుకు అద్దెకు భవనాలను అన్వేషిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర వాయిదా

మహారాణిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 16న జరగాల్సిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని 23వ తేదీకి వాయిదా వేసినట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. శనివారం పలు వేడుకలు, పండుగలు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. 23న నాలుగో శనివారం యథావిధిగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏఎంసీలో ఎనిమిది మందికి అడ్మిషన్లు

మహారాణిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర వైద్య కళాశాలలో 2025-26 బ్యాచ్‌కు సంబంధించి ఆల్ ఇండియా కోటా అడ్మిషన్లు ప్రారంభించారు. ఈమేరకు గురువారం ఎనిమిది మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. కళాశాలలో మొత్తం 250 సీట్లు ఉండగా అందులో 15 శాతం సీట్లు (38) ఆల్ ఇండియా కోటా కింద భర్తీ చేస్తారు. మిగిలిన 85 శాతం (212) సీట్లు రాష్ట్ర కోటా కింద ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో అడ్మిషన్లు నిర్వహిస్తారు. ఎనిమిది మంది విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి స్వాగతించి, అడ్మిషన్లు అందించారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవని ప్రజారోగ్య అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ కృష్ణంరాజు అన్నారు.గురువారం ఆయన 31వ వార్డులోని డాబాగార్డెన్స్, ఎల్లమ్మతోట ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు, ఇతర సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. కామేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

17న భువనేశ్వరి అమ్మవారి ఉత్సవం

డాబాగార్డెన్స్,ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : యాతపాలెం చెల్లాయమ్మ తోటలో ఉన్న భువనేశ్వరిదేవికి ఈనెల 17న సంపంగి పత్రితో ఆదివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు భువనేశ్వరిదేవి ఆరాధన పీఠం, ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు.ఉదయం పండితులు, పెద్దలతో అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, దివ్య పంచామృతాలతో మంగళస్నానం చేయిస్తామన్నారు.



23వ వార్డులో రోడ్డు దుస్థితి



24వ వార్డులో ఇష్టారాజ్యంగా తవ్వేసిన రోడ్డు

ఆ మార్గంలో వెళ్లాలంటే నరకమే

» అధ్వానంగా 23, 24వ వార్డుల్లోని రోడ్లు

» పట్టించుకోని కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధారలోని రహదారుల్లో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో కొన్ని రోడ్లను, అమృత్ పథకం నీటి సరఫరా పనుల పేరుతో మరికొన్ని రహదారులను రెండు నెలల క్రితం తవ్వేశారు. ఆ గోతులు పూడ్చకుండా అలానే వదిలేశారు. 'ఆంధ్రజ్యోతి' ఇటీవల ఈవిషయాన్ని వెలుగులోకి తీసుకురాగా పది రోజుల క్రితం గోతులపై రాళ్లు వేసి తూతూమంత్రంగా సరిచేశారు. కానీ రాళ్ల వల్ల ద్విచక్ర వాహనాల టైర్లు పంక్చర్లు అవుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు రాళ్లను తన్నుకొని కిందపడిపోయి గాయాలపాలవుతున్నారు. రాళ్లను తారుతో, సిమెంట్‌తోనో కలిపి వేస్తారు. కానీ ఇక్కడ రాళ్లను వెదజల్లి వెళ్లిపోయారు. గోతులను కప్పే విధానం ఇదేనా ? అని స్థానికులు వాపోతున్నారు. వార్డుల్లో జరిగే పనులను పర్యవేక్షించి చక్కగా చూడాల్సిన కార్పొరేటర్లు ఏమీపట్టనట్టు ఉంటున్నారు.ఇప్పటికైనా 24వ వార్డు కార్పొరేటర్ పద్మారెడ్డి, 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల సత్యారెడ్డి స్థానికుల సమస్యల పట్ల స్పందించాలని పలువురు కోరుతున్నారు.

'లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి'

మహారాణిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తోట వాసుదేవరావు కోరారు. గురువారం ఆయన మహారాణిపేటలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 16న లచ్చన్న 116వ జయంతిని జిల్లా కోర్టు సమీపంలో ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆయన స్వాతంత్ర్య పోరాటంతో పాటు మంత్రిగా కూడా రాష్ట్రానికి అనేక సేవలు అందించారని తెలిపారు. ఆయన జీవిత విశేషాలు భావితరాలకు తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పలాస కేంద్రంగా ఏర్పాటు కానున్న కొత్త జిల్లాకు సర్దార్ గౌతు లచ్చన్న జిల్లాగా నామకరణం చేయాలన్నారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ



అవయవదానంపై అవగాహన ర్యాలీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 14, (ఆంధ్రజ్యోతి): అవయవదానం చేస్తే మరో వ్యక్తికి ప్రాణదానం చేసినట్టేనని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ వరకు గురువారం అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎంతోమంది కిడ్నీ, లివర్, హార్ట్ తదితర అవయవాలు పాడై దాతల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వారి ప్రాణాలు కాపాడేందుకు అవయవదానమే పరిష్కారమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మూడు దుకాణాలపై 6ఏ కేసులు

తగరపువలస, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో వెల్డింగ్ దుకాణంలో పేలుడు జరిగిన నేపథ్యంలో భీమిలి ఆర్డీఓ కె.సంగీత్ మాథూర్ గురువారం తగరపువలస, భీమిలి రూరల్ మండలంలోని పలు వెల్డింగ్ దుకాణాలను తనిఖీ చేశారు. జీవీఎంసీ, అగ్ని మాపక శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల సిబ్బందితో సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. తగరపువలసలోని మూడు దుకాణాల్లో ఇళ్లకు ఉప యోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించి 6ఏ కేసు నమోదు చేసి, ఆయా షాపులను సీజ్ చేశారు. అలాగే రెండు రెస్టారెంట్లలో వాణిజ్యపరమైన గ్యాస్ కాకుండా గృహోపకరణానికి ఉపయోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించి కేసులు నమోదు చేశారు.

సింహాద్రినాథుడికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఆగస్టు 14 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడా మండప ప్రదక్షిణ చేశారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ సంపెంగలతో పూజలు జరిపారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.



ఆలయ సన్నిధిలో సింహాద్రి లయన్స్ జట్టు సభ్యులు

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

అప్పన్న స్వామిని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో పాల్గొంటున్న సింహాద్రి లయన్స్ జట్టు సభ్యులు దర్శించుకున్నారు. వారికి దేవాలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆహ్వానం పలికారు.కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఆంధ్ర వైద్య కళాశాలలో స్వాతంత్ర్య వీచిక

... 7వ పేజీ తరువాయి

సతీమణి చిట్టిజానకమ్మ వాల్తేర్‌లో కొంత భూమి, భవనాలు విరాళంగా ఇవ్వడంతో 1912లో పాఠశాలను అక్కడకు తరలించారు. అక్కడే ఆంధ్ర వైద్య కళాశాలగా ప్రారంభం కావడంతో తొలిసారిగా 32 మంది విద్యార్థులకు ప్రవేశాలు ఇచ్చారు. ఉత్తరాంధ్ర పరిసరాలకు చెందిన విద్యార్థులు ఎంబీబీఎస్ ఇంకా లైసెన్సియట్ ఎల్‌ఎంఎస్ కోర్సుల్లో చేరారు. అయితే కళాశాల నిర్వహణ పూర్తిగా ఆంగ్లేయులు రూపొందించిన నిబంధనల మేరకు నడిచేది. అప్పటికే స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా జరుగుతోంది. విద్యార్థులు పోరాటంలో పాల్గొనే అవకాశం ఉందని భావించిన ఆంగ్లేయ అధికారులు, సూటు, బూటు నిబంధన అమలుచేశారు. అయితే 1921 సెప్టెంబరు 28వ తేదీన వైద్య కళాశాలలో చదువుతున్న 142 మంది విద్యార్థులు సూటు, బూటును వదిలి స్వాతంత్ర్య పోరాటానికి సంఘీభావంగా గాంధీ టోపీలు, ఖాదీ వస్త్రాలు ధరించి తరగతులకు హాజరయ్యారు. ఇది ఒక్కసారిగా వైద్య కళాశాలలో కలకలం రేపింది. విద్యార్థులను ప్రశ్నించడంతో వారంతా ఎదురుతిరిగారు. డ్రెస్ కోడ్‌పై స్థానిక కోర్టులు విధించిన ఆంక్షల పట్ల నిరసన తెలిపారు. డ్రెస్ కోడ్ ఉల్లంఘనపై క్షమాపణ చెప్పాలని వైద్య కళాశాల అధికారులు ఆదేశించగా, 32 మంది నిరాకరించారు. దీంతో ఆ 32 మందిని వైద్య కళాశాల నుంచి తొలగించారు.

ఈ విషయం దేశంలో స్వాతంత్ర్య ఉద్యమ నాయకులకు చేరింది. 32 మంది వైద్య విద్యార్థుల దేశభక్తిని మహాత్మాగాంధీ తన యంగ్ ఇండియా పత్రికలో అదే ఏడాది నవంబరు 24న ప్రస్తావించారు.

'దేశం దీర్ఘకాలిక బానిసత్వ వ్యాధితో బాధపడుతుంది. ఈ వ్యాధికి నిజమైన నివారణను కనుగొనేందుకు అంకితం చేసుకునే వారే నిజమైన సర్జన్లు, వైద్యులు అవుతారు. ఆ సార్వత్రిక వ్యాధి నయమైనప్పుడు ప్లేగు, కలరా, మలేరియా తదితర వ్యాధులు చాలావరకు అదృశ్యమవుతాయి.' అని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు ఏవీఎన్, సీబీఎం స్కూలు విద్యార్థులు సంఘీభావం తెలిపారు. ఈ ఘటనపై దేశంలో అనేక ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్తరాలను యంగ్ ఇండియాలో ప్రచురించడానికి గాంధీ అంగీకరించారని విశాఖలో స్వాతంత్ర్య పోరాటానికి ముందు నుంచి ఇటీవల జరిగిన అనేక మార్పులపై పరిశోధన చేసిన జాన్ కాస్టిల్ పేర్కొన్నారు.

ఖాదీ దుస్తులు, టోపీ ధరించినందుకు సస్పెండైన 32 మంది వైద్య విద్యార్థులలో కొంతమందిని తరువాత చేర్చుకోగా, మరికొందరు వేరే కళాశాలలకు వెళ్లిపోయారు. ఇలా సస్పెండైన వారిలో నగరానికి చెందిన డాక్టర్ ఎంవీ కృష్ణారావు ఒకరు. ఆయన ఆంధ్ర వైద్య కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థి. వైద్య విద్య పూర్తిచేసి రాజకీయాల్లోకి వచ్చి మద్రాస్ రాష్ట్రంలో చక్రవర్తుల రాజగోపాలాచారి మంత్రివర్గంలో వైద్య, విద్య, హరిజన వెల్ఫేర్ (ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ) మంత్రిగా పనిచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యుడిగా 40 ఏళ్ల పని చేశారు.

చిరు వ్యాపారుల దెబ్బకు చిన్నబోతున్న రహదారులు

» రైతు బజార్ వద్ద నిత్యం ట్రాఫిక్ కష్టాలు » రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండడంతో రద్దీ » పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ రైతు బజార్‌కు రెండు వైపులా ఉన్న రహదారులపై చిరు దుకాణాలు వెలియడంతో రోడ్డు ఇరుకుగా మారి పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మధ్య చక్కగా రోడ్డు నిర్మించారు. ఈ విషయంలో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే రహదారిని ఆనుకుని ఉన్న చిరు దుకాణాల వారు మరింతగా ముందుకు వచ్చి, రహదారిని ఆక్రమిస్తున్నారు. కొనుగోలుదారులు కూడా తమ వాహనాలను అక్కడే నిలిపి బేరసారాలు ఆడుతుండడంతో అటుగా ప్రయాణించే వారికి చాలా ఇబ్బంది ఎదురవుతోంది. పాదచారులైతే నడవలేని పరిస్థితి ఎదురవుతోంది. ఉదయం,


సరుకుల కొనుగోలు కోసం రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

సాయంత్రం రైతు బజార్ సాధారణ రోజుల్లోనే రద్దీగా ఉంటుంది. ఆదివారం, పండుగల రోజుల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

అయితే చిరు వ్యాపారాలను చేసుకుంటున్న వారిని తొలగించడం వల్ల వారి ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉందని భావిస్తే కనీసం వారిని కాస్తా లోపలకు తమ వస్తువులను ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు. అలాగే కొనుగోలుదారులు వాహనాలను అక్కడ నిలపకుండా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొద్ది రోజుల కిందట జీవీఎంసీ కమిషనర్ అన్న క్యాంటీన్ పరిశీలనకు వచ్చినప్పుడు రోడ్డుపైకి దుకాణాలు రాకుండా చూడాలంటూ అధికారులను ఆదేశించారు. అయితే గ్రేటర్ కమిషనర్ ఆ ఆదేశాలు అమలులోకి రాలేదు. ఏ ఒక్క అధికారీ కూడా అందుకు చర్యలు తీసుకోలేదు. కనీసం ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

11వ వార్డులో సామాజిక భవనం ప్రారంభం


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 11వ వార్డులోని ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి అనువుగా తీర్చిదిద్దిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ 11 వార్డులో ప్రజల అవసరాలు తీర్చే విధంగా సామాజిక భవనాన్ని నిర్మించినట్టు చెప్పారు. అంతకు ముందు ఎమ్మెల్యే అప్సరా కాలనీ-2లో ప్రజల దాహార్తిని తీర్చేదుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు.

ఈ కార్యక్రమాల్లో టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, కార్యదర్శి పేపరు నాయుడు, నేతలు శ్రీనివాసరావు, మూది అప్పారావు, రేఖా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వినాయక నవరాత్రులకు పందిరి రాట


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో అయిదో సెక్టరులో ప్రతి యేటా నిర్వహించే విధంగా ఈ ఏడాది కూడా వినాయకచవితి ఉత్సవాలను ఘనంగా చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందుగా పంది రాట పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు చోడె పట్టాభిరాం, కాళ్ల శంకర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాపురంలో కొండచిలువ కలకలం



ఆరిలోవ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాపురంలో బుధవారం అర్ధరాత్రి కొండచిలువ కలకలంసృష్టించింది. ఇది జన సంచారంలోకి వచ్చింది. దీన్ని చూసి స్థానికులు భయభ్రాంతులకు లోనయ్యారు. స్థానికుడు మారికి జక్కన్న ఈ కొండచలువను చాకచక్యంతో పట్టుకొని దగ్గరలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలకు భారీ సన్నాహాలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శుక్ర, శని, ఆదివారాల్లో ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహించనున్న కృష్ణాష్టమి వేడుకలకు హరేకృష్ణ మూవ్‌మెంట్ భారీ సన్నాహాలు చేస్తోంది. మూడు రోజుల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, సాయంత్రం 5 నుంచి 9 వరకూ భక్తులకు దర్శనం ఉంటుంది. 108 పలకలతో హరినామ జపమండపం ఏర్పాట్లు చేస్తున్నారు. 16న రాత్రి 9.30కి మహా అభిషేకం, పన్నెండు గంటలకు మంగళహారతి నిర్వహించనున్నారు. సప్తనదుల్లో సేకరించిన జలంతో, 108 పవిత్ర జల కలశాలలు, పండ్లరసాలు, పంచామృతం, పంచంగవ్యాలు, వివిధ పుష్పాలతో మహాభిషేకం నిర్వహిస్తారు. బాలగోపాలుడికి ఊయల సేవ, ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టడం, కృష్ణుడితో సెల్ఫీ, చిత్రాలలో తేడాలను గుర్తించడం, కృష్ణుడు ఎవరు అనే అంశంపై


వేడుకలకు ముస్తాబు అవుతున్న వేదిక

పరీక్ష వంటి పోటీలు కూడా నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధి యుదురాజా దాస తెలిపారు. చివరి రోజు వ్యాస పూజ, నందోత్సవం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

ఎప్పుడు చూసినా..
గేజ్ 3లోనే

» మరమ్మతుకు నోచుకోని సింహాద్రిపురం వాటర్ పంప్‌హౌస్


సింహాద్రిపురం వాటర్ పంపు హౌస్ వద్ద పనిచేయని వాటర్ గేజ్

వెంకోజీపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు హెచ్‌బీకాలనీ వద్ద ఉన్న సింహాద్రిపురం వాటర్ పంప్‌హౌస్ వాటర్ ట్యాంకు వద్ద నీటి నిల్వను తెలియజేసే వాటర్ గేజ్ పని చేయడం లేదు. ఎప్పుడూ వాటర్ గేజ్ ముళ్లు 3 వద్దే ఉన్నట్టు కనిపిస్తుంటుంది. దీంతో ట్యాంకులో నీటి నిల్వ ఎంత ఉందో తెలుసుకోవాలంటే.. ఇక్కడ పనిచేసే పైపు లైనులో నీటిని విడుదల చేసే లైన్‌మన్ ట్యాంకు పైకి ఎక్కి తెలుసుకోవాల్సి వస్తోంది. దాదాపు రెండేళ్ల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉందని లైన్‌మన్ చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాటర్ గేజ్ మరమ్మతు చేపట్టాలని నిర్వాహకులు కోరుతున్నారు.

వాల్తేరు ఫొటోగ్రఫిక్ సొసైటీ రజతోత్సవ పోస్టర్ విడుదల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుమన్ కలగర్, ఫొటోగ్రఫీ సొసైటీ సభ్యులు

పెదవాల్తేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని, వాల్తేరు ఫొటోగ్రఫిక్ సొసైటీ 25వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 19, 20వ తేదీల్లో నిర్వహించనున్న రజతోత్సవ సంబరాల పోస్టర్‌ను గురువారం విజయ మెడికల్ సెంటర్ సెమినార్ హాలులో విజయ మెడికల్ సెంటర్ ఎం.డి. డాక్టర్ సుమన్ కలగర్ సొసైటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి ఎంవీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 19వ తేదీన ఆంధ్రవిశ్వకళాపరిషత్ హిందీ విభాగం సెమినార్ హాలులో సుమారు వెయ్యి ఫొటోలతో ఫోటో ప్రదర్శన మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. అనంతరం నృత్య ప్రదర్శన, వాల్తేరు ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో 2000లో ఆవిర్భవించిన దగ్గర నుంచి ఫోటో ప్రదర్శనలు, ఉచిత ఫొటోగ్రఫీ మీద వర్క్ షాపులు, ఫొటోషూట్లు నిర్వహిస్తామన్నారు. అలాగే పురాతన కెమెరాలు ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు, ప్రతినిధులు జగపతిరాజు, ఎస్.శ్రీనివాసరావు, సతీష్‌కుమార్, వేణుగోపాలరావు, కెఎంకె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశమే ముఖ్యం నినాదంతో ముందుకు సాగాలి

» ఏయూ విద్యావిభాగాధిపతి టి.షారోన్ రాజు


హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విశాఖపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : దేశాభ్యున్నతి, వికాసం ప్రధాన లక్ష్యంగా యువత ముందుకు సాగాలని ఏయూ విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అన్నారు. ఏయూలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరూ దేశ సమగ్రతకు కృషి చేస్తూ అభివృద్ధి చోదక శక్తిగా మారాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు త్రివర్ణ పతాకాన్ని చేబూని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. విభాగ ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ మూర్తి డాక్టర్ ప్రవీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్లూప్రింట్ ఫర్ అకడమిక్ అండ్ కెరీర్ ఎక్సలెన్సీపై ఏయూలో సదస్సు


ముఖ్యవక్తలను సన్మానించిన ఏయూ విభాగాధిపతులు

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో గురువారం ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ వుమెన్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బ్లూ ప్రింట్ ఫర్ అకడమిక్ అండ్ కెరీర్ ఎక్సలెన్సీ-2025 అంశంపై ఒక రోజు సెమినార్‌ను గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, మెకానికల్ విభాగం హెచ్‌వోడీ ఆర్.మధుసూదనరావు సెమినార్‌ను ప్రారంభించారు. ఆర్. సత్యికా సైయెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ హైదరాబాద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్, సీటెక్ ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీ ఉపాధ్యక్షులు, ఎన్ఎస్‌టీఎల్ మాజీ శాస్త్రవేత్త ముఖ్యవక్తలుగా పాల్గొన్నారు. ప్రారంభ సెషన్‌కు ఆచార్య ఆర్.మధుసూదన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి 150 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వివిధ విభాగాధిపతులు ఆచార్యులు ప్రజ్ఞ, అన్నపూర్ణ, డాక్టర్ అరుణ, డాక్టర్ శిరీష పాల్గొనిముఖ్యవక్తలను సత్కరించారు.

వర్షాల సమయంలో ముందస్తు జాగ్రత్తలు అవసరం

» అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



వెంకోజీపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున జీవీఎంసీ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులను గురువారం ఆదేశించినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే వర్షాలు పడే సమయంలో లోతట్టు, కొండవాలు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితిలో అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జోనల్ స్థాయిలో లోతట్టు, కొండవాలు ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో వర్షాలు వల్ల ఎదురయ్యే ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించామన్నారు. అధికారులు అన్ని సామాజిక భవనాలను తనిఖీలు నిర్వహించి అందులో గల సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలలో ప్రజలు లేకుండా చూడాలని ఆదేశించారు. నగర పరిధిలో అన్ని మ్యాన్‌హోల్స్‌ను సురక్షిత మూతలతో కప్పి ఉండేలా చూడాలని, ప్రజల తాగునీటికి ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని, నీరు కలుషితం జరగకుండా నాణ్యత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. వీధి దీపాల నిర్వహణతో పాటు వాటి లోపాలను సరిదిద్ది అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలన్నారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియపరిచి వారి సహకారం తీసుకోవాలని సూచించారు. వర్షాలు, గాలుల వల్ల చెట్లు కూలే ప్రమాదం ఉన్నందున కూలిన చెట్లను వెనువెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, ఎండిన లేదా బలహీనంగా ఉన్న చెట్లను తొలగించాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు. అనధికార పాత పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్లు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కాలువలలో పూడికలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అన్ని జోనల్ స్థాయి అధికారులు జోనల్ కంట్రోల్ రూమ్స్‌లో 24 గంటలూ అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, అత్యవసర పరిస్థితిలో జీవీఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్‌ను సమాచార కేంద్రంగా వినియోగించుకోవాలని సూచించారు. నగర ప్రజలు వర్షాలు పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాల వద్ద, చెట్ల కింద, పాత భవనాల వద్ద హోర్డింగులు వద్ద, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండరాదని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, అధికారులు సూచించిన ప్రదేశాలలో ఉండాలని కమిషనర్ ప్రకటన ద్వారా తెలియజేశారు.

రూ.5.5 లక్షలతో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఆధునికీకరణ

» సీపీ శంఖబ్రత బాగ్చి


ఆధునీకరించిన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న పోలీసు అధికారులు

మద్దిలపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మరమ్మత్తులకు గురైన మూడోపట్టణ పోలీస్‌స్టేషన్‌ను రూ. 5.50 లక్షలతో ఆధునీకరించినట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చెప్పారు. ఆధునీకరించిన మూడోపట్టణ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 1989లో నిర్మించిన మూడోపట్టణ పోలీస్‌స్టేషన్ భవనం 35 ఏళ్లు గడిచినా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారిందన్నారు. శ్లాబ్‌లు పెచ్చులూడిపోయి వర్షం వస్తే నీరు లీక్ అవడం, బీటలు వారిన గోడలతో ఉండేదన్నారు. అందుకే వెంటనే త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ భవనాన్నిమరమ్మత్తులు చేపట్టాలని పోలీస్ సౌజన్య కార్పొరేషన్, ఏఆర్ ఏడీసీపీలకు ఉత్తర్వులివ్వగా పనులు పూర్తి చేశారన్నారు. శ్లాబ్‌లు, గోడలకు మరమ్మత్తులు చేసి, రంగులు వేశారన్నారు. మెట్లకు స్టీల్ రైలింగ్, ఎలాక్ట్రికల్ పనులు చేసి మరో పదేళ్ల భవనం లైఫ్‌ను పెంచామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, శ్రీకృష్ణకాంత్ పటేల్, కె.లతామాధురి, ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ పైడయ్య పాల్గొన్నారు.

ఇగ్నో ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నగరంలోని అధ్యయన కేంద్రాల్లో గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించింది. కేజీహెచ్ ఆవరణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, జైలు రోడ్డులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇగ్నో ప్రాంతీయ సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఇగ్నో అదనపు సంచాలకులు డాక్టర్ కృష్ణారావు పర్యవేక్షించారు.



జాతీయ జెండాలతో డిగ్రీ కళాశాల విద్యార్థులు

కాలువలో మరమ్మతుకు చర్యలు

వెంకోజీపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు ఎంఎంటీసీ కాలనీ ప్రధాన రహదారి వద్ద మోడ్రన్ ఫుట్‌పాత్ కింద ఉన్న కాలువలో పలక పడిపోవడం బుధవారం కాలువలోని మురుగు నీరంతా రోడ్డుపైనే వరదలా ప్రవహించింది. స్థానికుల ఫిర్యాదు మేరకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్, శుభ్రం మేస్త్రి రమణలు వెంటనే స్పందించి, కాలువలో అడ్డంగా ఉండిపోయిన పలకను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో రోడ్డుపై ప్రవహించే మురుగునీటిని నిలిపి వేశారు. కాలువలో పలకతో పాటు పేరుకుపోయిన చెత్తను కూడా పారిశుధ్య సిబ్బంది తొలగించారు.


కాలులో పలకను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

నగరంలో వర్షాలు వచ్చే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో శానిటరీ సిబ్బంది అప్రమత్తమవుతున్నారు. ప్రధాన రహదారుల్లో ఉన్న కాలువలు, గెడ్డలను శుభ్రం చేస్తున్నారు. వర్షం పడితే ఎక్కడా మురుగునీరు కానీ, వర్షపు నీరు కానీ రోడ్డుపై నిలిచి పోకుండా తగు చర్యలు చేపడుతున్నట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్ తెలిపారు.

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవరచుకోవాలి

» రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, పాల్గొన్న హోంమంత్రి వి.అనిత

రామ్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ పోటీ ప్రపంచంలోవిద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగల పూడి అనిత అన్నారు. విశాఖలో సుమారు 5400 మంది ఆదిత్యా కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాలు సాధించిన నేపథ్యంలో గురువారం ఏయూ కాన్వొకేషన్ సమావేశ మందిరంలో ఆదిత్యా అచీవర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హోంమంత్రి అనితతో పాటు విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు.

అనంతరం విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ నేటి విద్యార్థులకు ఎన్నో విద్యా, ఉపాధి, వ్యాపార అవకాశాలు ఉన్నాయని, అందుకోసం విద్య పూర్తి చేసిన అనంతరం ఉద్యోగాలు కోసం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఉద్యోగాల కల్పించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి అనుభవాలను సమస్యలను పంచుకున్నారు. అనంతరం డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఆదిత్యా విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి సుగుణా రెడ్డి, బీఈవీఎల్ నాయుడు, పి.రామకృష్ణారెడ్డి, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

అన్నప్రసాదానికి దాతల ఉదారతే మూలం


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అధికారులు

సింహాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి దాతల ఉదరతే మూలాధారమని దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె. తిరుమలే శ్వరరావు అన్నారు. అన్న ప్రసాద పథకం ప్రారంభించి గురువారం నాటికి 36 ఏళ్ల పూర్తి కావడంతో భక్తులకు ఆయన అధికారులతో కలిసి అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవస్థానం ఉద్యోగులు తొలి విరాళంతో ప్రారంభమైన ఈపథకానికి ఇప్పటివరకు వేలాది మంది దాతలు ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం ఏఈఓ రమణమూర్తి, పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావు,సిబ్బంది రేవతి, కాశీ, డీఈఈ ఎస్.సన్యాసిరావు (తాతాజీ), పీఆర్ఓ డి. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కృష్ణాపురం రైతుల వినతి

పద్మనాభం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎంఎస్ఎంఈ పార్కునకు భూములు కేటాయించారని, ఈ విష యమై న్యాయం చేయాలని కృష్ణాపురం గ్రామ రైతులు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కోరారు.

గురువారం వారు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నెంబరు 88, 93లో సుమారు 66 ఎకరాలను ఎంఎస్ఎంఈ పార్కునకు కేటాయించారన్నారు. ఈ భూముల్లో తాము 50 ఏళ్లుగా టేకు, నీలగిరి, జీడి చెట్లు పెంచుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ముందస్తు నోటీసులు గాని, గ్రామసభ గాని నిర్వహించకుండా భూములను పార్కునకు కేటాయించారన్నారు. తమకు న్యాయం చేసి, భూసేకరణ చట్టం-2013 ప్రకారం భూ కేటాయింపులు చేయాలని కోరారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 24, బీరకాయలు 18, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46,దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

సీతమ్మధారలో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, నవోదయ విద్యాసంస్థల అధినేతలు

సీతమ్మధార, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గం పరిధి సీతమ్మధార మండలంలో తిరంగ యాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో నవోదయ విద్యా సంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జాతీయ పతాకంతో ముందుకు సాగారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేతలు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు సురేష్‌బాబు, నానాజీ, అనంత్, రవి కుమార్, మాదేటి కనకరావు, రాజు, రామరాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న దేశ భక్తి ఉత్సాహాన్ని నింపారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా

» బీజేపీ ఆధ్వర్యంలో భారీ జెండాతో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక, ఆ పార్టీ నేతలు



భారీ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు, జీవీఎంసీ హైస్కూలు విద్యార్థులు

మాధవధార, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) ; విశాఖ ఉత్తరంలోని బీజేపీ 50వ వార్డు అధ్యక్షుడుకూన వెంకటరావు అధ్వర్యంలో గురువారం భారీ హమ్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ హైస్కూలు విద్యార్థులు ర్యాలీలో పొడవైన జాతీయ జెండాను చేబూని 'జైహింద్.. జై భారత్' నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామలాదీపిక, బీజేపీ యువ నాయకుడు సునీల్ అగర్వాల్ హాజరయ్యారు. జీవీఎంసీ మాధవధార హైస్కూలు హెచ్ఎం బి.హేమలత, టీచర్స్ ప్లకార్డులు పట్టి భారత స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా కూన వెంకటరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై పాల్గొన్న బాలలకు అభినందనలు తెలిపారు. విద్యార్థి దశ నుంచే దేశ భక్తి, పెద్దలను గౌరవించే మన సంస్కృతిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. సమైక్యతను చాటి చెప్పే స్వాతంత్ర్య సంబరాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని దేశ గొప్పదనాన్ని చాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ నాయకులు హాజరయ్యారు.

200 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ

అక్కయ్యపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్రేటర్ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు 200 అడుగుల త్రివర్ణ పతాకంతో గురువారం సాయంత్రం పెరేడ్ నిర్వహించారు. పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీని ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి ప్రారంభించారు. ఈ ర్యాలీ పాఠశాల ప్రాంగణం నుంచి అక్కయ్యపాలెం వేణుగోపాలస్వామి ఆలయం, మహారాణి పార్లర్ జంక్షన్ మీదుగా పాఠశాల వరకు సాగింది. ఈ ప్రాంతమంతా 'భారత్ మాతాకీ జై' నినాదంతో మార్మోగింది. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు యూఎన్ రత్నం, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, శ్యామల, గ్లోరీ, హేమ తదితరులు పాల్గొన్నారు.



200 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు

విద్యార్థులు నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ విద్యార్థులు

కంచరపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కూడిన నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ పేర్కొన్నారు. కళాశాలలో ఇన్ఫోసిస్ సహకారంతో చేపట్టిన నైపుణ్య శిక్షణ వ్యాలిడేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు చి.అప్పారావు మాట్లాడుతూ .విద్యార్థులు శిక్షణలో చేర్చుకున్న నైపుణ్యాలను ఉద్యోగ జీవితంలో వినియోగించి ఉన్నతికి చేరుకోవాలన్నారు. ఉన్నతి ఫౌండేషన్ ట్రైనర్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, జీవన నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులు శిక్షణలో పొందిన మెలకువలతో ప్రదర్శించిన నాటికలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డా.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్వీ కుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతతో డిజైన్ కనెక్ట్ 2025

సీతంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డిజైనర్స్‌లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు వారి ప్రతిభను చాటి చెప్పే విధంగా డిజైన్ కనెక్ట్ 2025 కార్యక్రమాన్ని ఇకో థీమ్‌తో నిర్వహిస్తున్నట్టు ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ (ఐఎస్ఎస్‌డి) ప్రతినిధులు నిర్మాణ్ ఆర్కిటెక్ట్ బి.సురేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ హేమ సుందర్, డైరెక్టర్ అమృత పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల ఐఎస్ఎస్‌డీ సంస్థలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ డిజైన్ కనెక్ట్ 2025ని సెప్టెంబర్ 20వ తేదిన పోర్టు స్టేడియంలో గల విశ్వనాథ స్పోర్ట్స్‌లో పలువురు డిజైనర్స్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలలలో నుంచి సృజనాత్మక మేధావులు ఒక చోట చేర్చి కళాత్మకమైన దుస్తుల కలెక్షన్లు, ఆంధ్ర ప్రాంతపు హస్తకళలు డిజైన్ కనెక్ట్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు, ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకుడు వీరు మామ చేతుల మీదుగా డిజైన్ కనెక్ట్ 2025 పోస్టర్‌ని ఆవిష్కరించారు.

వుడా భూసేకరణ లబ్ధిదారుల నుంచి ప్లాట్లు కొని ఇబ్బందులు

» కూటమి ప్రభుత్వం చొరవ చూపి న్యాయం చేయాలని వుడా ప్లాట్ ఓనర్స్ సంఘం వినతి

సీతంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) :వుడా భూసేకరణ లబ్ధిదారుల నుంచి కొన్ని సంవత్సరాల క్రితంప్లాట్లు కొనుగోలు చేసి మోసపోయామని, మా గోడును ప్రజా ప్రతనిధులు, వుడా అధికారులకు విన్నవించుకున్నామని, న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చొరవ చూపి చర్యలు చేపట్టాలని వుడా ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పీలా అప్పలనాయుడు, సీతారామరాజు, దత్తిరాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భూసేకరణ పద్ధతిలో 2009 నుంచి 2011 మధ్య కాలంలో అప్పట్లో వుడా సంస్థ రుషికొండ, మధురవాడ, కొమ్మాది, ఓజోన్ వ్యాలీ ప్రాంతాల్లో భూసేకరణ చేసి భూమి కోల్పోయిన రైతులకు 750 చదరపు గజాలు డెవలప్ సైట్ సర్వే నెంబరు 34, 35 (రుషికొండ)లో భూమి కేటాయించిందని తెలిపారు. ఈ విధంగా వుడా రైతులకు కేటాయించిన 450 సైట్లను పలువురు కొనుగోలు చేయడం, అమ్మడం కూడా జరిగిందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ ప్లాట్లకు నీరు, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ సదుపాయాలుకల్పించకుండా వదిలేశారన్నారు. సంవత్సరాల తరబడి వుడా తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు చుట్టూ తి రుగుతున్నా ప్రయోజనం లేకపోయిందని అవేదన వ్యక్తం చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసి ప్లాట్లు చెల్లవంటూ 2012లో వుడా అధికారులతో కుమ్మక్కై రైతులు ప్లాట్లు పొందారని ప్రకటన వెలువడించారన్నారు. 75 శాతం ప్లాట్లు రైతులు వేరే వారికి విక్రయించారని, కొనుగోలు చేసిన ప్లాట్లలో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ప్లాట్లు చెల్లవన్న ప్రకటన గురించి అధికారులకు అడిగితే 2014లో విజిలెన్స్ విచారణ చేపట్టి రైతులకు ప్లాట్ల కేటాయింపు చెల్లదని చెప్పిందన్నారు. వీఎంఆర్డీఏగా మారిన తర్వాత తమకు న్యాయం చేయాలని అడిగితే 2009-2011 రికార్డులుతమ వద్ద లేదని తప్పించుకుంటున్నారన్నారు. తమకు న్యాయం చెయ్యాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు దృష్టికి తీసుకు వెళ్ళగా తమకు హామి ఇచ్చి అసెంబ్లీలో తమ సమస్యను ప్రస్తావించారని తెలిపారన్నారు. అసెంబ్లీ చర్చ జరిగి అయిదు నెలలు గడిచినా తమకు న్యాయం జరగలేదని,ప్రభుత్వంచొరవ తీసుకొని న్యాయంచేయాలనికోరుతున్నామన్నారు.

రైల్వే స్టేషన్‌లో దేశ విభజన నాటి ఫొటో ప్రదర్శన ప్రారంభం



.ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా, రైల్వే అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ రైల్వే స్టేషన్‌లో దేశ విభజన సమయంలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను వర్ణించిన ఛాయాచిత్రాలతో వాల్తేరు డివిజన్ ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా గురువారం ప్రారంభించారు. దేశ విభజన భయానక స్మారక దినోత్సవంగా పేర్కొనే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఛాయా చిత్రాల ప్రదర్శను డీఆర్ఎం తిలకించారు. దేశ విభజన సమయంలో లక్షలాది కుటుంబాల స్థానభ్రంశం చెంది ఎదుర్కొన్న కష్టాలను వర్ణించే ఉత్తేజకరమైన చిత్రాలను చూసి అమర వీరులు, బాధితులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాడీఆర్ఎం మాట్లాడుతూ దేశ విభజనకు ముందు లక్షలాది మంది ప్రజల విషాద ఘటనలు, త్యాగాలు, భావోద్వేగాల జ్ఞాపకార్థంగా విభజన భయానక స్మారక కార్యక్రమం జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు చారిత్రక బాధలు, త్యాగాలు తెలుసుకోవాల్సిన ఆవసరముందన్నారు. వలసల సమయంలో స్థానభ్రంశం చెందిన సమయంలో ఏర్పడిన కల్లోలం, నష్టం ఎప్పటికీ మరుపురాని చేదు దృశ్యాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీపీవో కబీర్ అన్సారి, సీనియర్ డీసీఎం కె.సందీప్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి ద్వారకానగర్‌లో ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద ఫుట్‌పాత్‌పై ఒక గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో ఆ వ్యక్తిని 108 అంబులెన్స్‌లో మంగళవారం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేపట్టారు. మృతదేహన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు, బంధువులు ఎవరైనా ఉంటే ద్వారకా పోలీసు స్టేషన్ లేదా పోలీసు స్టేషన్ ఫోన్ : 63051870009లో సంప్రదించాలని కోరారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

... 7వ పేజీ తరువాయి

ఆస్పత్రుల్లో పెద్దఎత్తున దోపిడీ జరుగుతున్నా ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

వసూళ్లే లక్ష్యం..

నగర పరిధిలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు వసూళ్లే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. తమ ఆస్పత్రులకు రోగులను తీసుకువచ్చేందుకు ప్రత్యేక టీమ్‌లను నియమించుకుంటున్నాయి. ఇందుకోసం ఆర్ఎంపీ, పీఎంపీలకు భారీగా కమీషన్లు ముట్టజెబుతున్నాయి. కొన్ని ఆస్పత్రులైతే రోగులు చెల్లించే మొత్తంలో కొంత పర్సంటేజీ ఇస్తున్నాయి.

నేడు స్త్రీశక్తికి శ్రీకారం

... 7వ పేజీ తరువాయి

దూరం ఆధారంగా నిర్దేశించిన మేరకు టికెట్లు జారీ చేస్తారు. మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడకు ప్రయాణించినా జీరో టికెట్లు ఇస్తారు.

దూర ప్రాంతాలకు...

స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు ఉచితంగా వివిధ రూట్లలో దూర ప్రాంతాలకు కూడా రాకపోకలు సాగించవచ్చు. విశాఖ నుంచి విజయవాడకు మూడు ఎక్స్‌ప్రెస్‌లు, రాజమండ్రికి గంటన్నరకొకటి చొప్పున ఎక్స్‌ప్రెస్/మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. కాకినాడకు రెండు గంటలకొక ఎక్స్‌ప్రెస్/మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. విజయనగరం, బొబ్బిలి, సాలూరు ప్రాంతాలకు గంటకొకటి, శ్రీకాకుళం, రాజాం, పాతపట్నం, టెక్కలి, సోంపేట ప్రాంతాలకు అరగంటకొకటి చొప్పున ఆర్డినరీ, పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. వీటిలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

పీ-4కు 4,000 మంది మార్గదర్శకులు గుర్తింపు

... 7వ పేజీ తరువాయి

కుటుంబాలను మ్యాపింగ్ చేశామన్నారు. పెద్ద కంపెనీలకు ఎక్కువ స్థాయిలో బంగారు కుటుంబాలతో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 607 సచివాలయాల పరిధిలో కనీసం 10 మంది చొప్పున మార్గదర్శకులను గుర్తించే పని చురుగ్గా సాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 19వ తేదీన పీ-4 ప్రారంభం కానున్నదని, ఆలోగా మరింత మంది మార్గదర్శకులను గుర్తిస్తామన్నారు.

నగరంలో ఇన్ ఆర్బిట్ మాల్ నిర్మిస్తున్న రోహేజా గ్రూపు ఐటీ పార్కు అభివృద్ధికి పలుచోట్ల స్థలాలను పరిశీలించిందన్నారు. రుషికొండ ఐటీ హిల్స్ వద్ద 20 ఎకరాలు చూసిందన్నారు. కాగా, కాగ్నిజెంట్‌కు మధురవాడలో హరిత ప్రాజెక్టు పక్కన 22 ఎకరాలు, ఐటీ పార్కు అభివృద్ధి కోసం సిఫీ కంపెనీకి పరదేశిపాలెంలో 25 ఎకరాలు గుర్తించామన్నారు. ఇప్పటివరకూ ఐటీ కంపెనీలకు 100 ఎకరాలు కేటాయించామని వివరించారు. కాగ్నిజెంట్ సొంత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యేసరికి కొంత సమయం పడుతుందని, అప్పటివరకూ నగరం నుంచి కార్యకలాపాలు చేపట్టాలని యోచిస్తోందన్నారు. త్వరలో సుమారు రెండు వేల మందితో కార్యకలాపాలు ప్రారంభించేందుకు అద్దెకు భవనాలను అన్వేషిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, నాయకులు

మల్కాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 59వ వార్డు ములగాడ ప్రాంతంలో గురువారం హర్‌ఘర్ తిరంగా యాత్రను స్థానిక బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కె.విజయ్ బాబు, ములగాడ మండల అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది బీజేపీ కార్యకర్తలు, స్థానికులు జాతీయ జెండాలను పట్టుకుని నినాదాలు చేసుకుంటూ వార్డులోని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ రమణయ్య, బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి పరమేశ్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర వాయిదా

మహారాణిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 16న జరగాల్సిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని 23వ తేదీకి వాయిదా వేసినట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. శనివారం పలు వేడుకలు, పండుగలు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. 23న నాలుగో శనివారం యథావిధిగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏఎంసీలో ఎనిమిది మందికి అడ్మిషన్లు

మహారాణిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర వైద్య కళాశాలలో 2025-26 బ్యాచ్‌కు సంబంధించి ఆల్ ఇండియా కోటా అడ్మిషన్లు ప్రారంభించారు. ఈమేరకు గురువారం ఎనిమిది మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. కళాశాలలో మొత్తం 250 సీట్లు ఉండగా అందులో 15 శాతం సీట్లు (38) ఆల్ ఇండియా కోటా కింద భర్తీ చేస్తారు. మిగిలిన 85 శాతం (212) సీట్లు రాష్ట్ర కోటా కింద ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో అడ్మిషన్లు నిర్వహిస్తారు. ఎనిమిది మంది విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి స్వాగతించి, అడ్మిషన్లు అందించారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీఐటీయూ నిరసన

మల్కాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే పగల గొట్టమని లోకేశ్ చెప్పారని, ఇప్పుడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపడం సిగ్గుచేటని మల్కాపురం జోన్ సీఐటీయూ నాయకుడు పి. పైడిరాజు అన్నారు. శ్రీహరిపురం జీవీఎంసీ వార్డు ఆఫీస్ వద్ద స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లును ఇంటికి ఏర్పాటు చేసేందుకు వస్తే అడ్డుకోవాలని అన్నారు. పాత మీటర్లును తొలగించి వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పూనుకుందని అన్నారు. సెల్‌ఫోన్ రీచార్జి చేసుకున్నట్టు మీటర్లకు కూడా రీచార్జి చేసుకోవాలని ఆయన వివరించారు. ఈ ప్రక్రియ వల్ల ప్రజలపై మరింత భారం పడనున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

పెందుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పెందుర్తిలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను బుధవారం తెలిపారు. రక్తదానం చేసేవారు 8639999343 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



23వ వార్డులో రోడ్డు దుస్థితి



24వ వార్డులో ఇష్టారాజ్యంగా తవ్వేసిన రోడ్డు

ఆ మార్గంలో వెళ్లాలంటే నరకమే

» అధ్వానంగా 23, 24వ వార్డుల్లోని రోడ్లు

» పట్టించుకోని కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధారలోని రహదారుల్లో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో కొన్ని రోడ్లను, అమృత్ పథకం నీటి సరఫరా పనుల పేరుతో మరికొన్ని రహదారులను రెండు నెలల క్రితం తవ్వేశారు. ఆ గోతులు పూడ్చకుండా అలానే వదిలేశారు. 'ఆంధ్రజ్యోతి' ఇటీవల ఈవిషయాన్ని వెలుగులోకి తీసుకురాగా పది రోజుల క్రితం గోతులపై రాళ్లు వేసి తూతూమంత్రంగా సరిచేశారు. కానీ రాళ్ల వల్ల ద్విచక్ర వాహనాల టైర్లు పంక్చర్లు అవుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు రాళ్లను తన్నుకొని కిందపడిపోయి గాయాలపాలవుతున్నారు. రాళ్లను తారుతో, సిమెంట్‌తోనో కలిపి వేస్తారు. కానీ ఇక్కడ రాళ్లను వెదజల్లి వెళ్లిపోయారు. గోతులను కప్పే విధానం ఇదేనా ? అని స్థానికులు వాపోతున్నారు. వార్డుల్లో జరిగే పనులను పర్యవేక్షించి చక్కగా చూడాల్సిన కార్పొరేటర్లు ఏమీపట్టనట్టు ఉంటున్నారు.ఇప్పటికైనా 24వ వార్డు కార్పొరేటర్ పద్మారెడ్డి, 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల సత్యారెడ్డి స్థానికుల సమస్యల పట్ల స్పందించాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను, బుధవారం కురిసిన వర్షానికి దెబ్బతిన్న రోడ్లను కార్పొరేటర్ బొమ్మిడి రమణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల విద్యుత్ వైర్లు ఇబ్బందిగా ఉన్నాయని వాటిని సరిచేయాలని సబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాలిపోయిన విద్యుత్ స్తంభాలు



వెంకటాపురం రహదారిలో స్తంభాల పరిస్థితి

గోపాలపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతోశ్‌నగర్ కాలనీ నుంచి వెంకటాపురం ఐదు మదాలకు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలు శిథిల స్థితిలో ఉన్నాయి. అంతేకాకుండా ఈ రహదారిలో ఉన్న 11కేవీ విద్యుత్‌లైనులో కొన్ని విద్యుత్ స్తంభాలు ఒక పక్కకు వాలిపోయి ఉన్నాయి. కొంచెం పెద్ద వర్షాలు కురిస్తే ఇవి పడిపోవడం ఖాయమని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ



అవయవదానంపై అవగాహన ర్యాలీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 14, (ఆంధ్రజ్యోతి): అవయవదానం చేస్తే మరో వ్యక్తికి ప్రాణదానం చేసినట్టేనని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ వరకు గురువారం అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎంతోమంది కిడ్నీ, లివర్, హార్ట్ తదితర అవయవాలు పొందే దాతల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వారి ప్రాణాలు కాపాడేందుకు అవయవదానమే పరిష్కారమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మూడు దుకాణాలపై 6ఏ కేసులు

తగరపువలస, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో వెల్డింగ్ దుకాణంలో పేలుడు జరిగిన నేపథ్యంలో భీమిలి ఆర్డీఓ కె.సంగీత్ మాథూర్ గురువారం తగరపువలస, భీమిలి రూరల్ మండలంలోని పలు వెల్డింగ్ దుకాణాలను తనిఖీ చేశారు. జీవీఎంసీ, అగ్ని మాపక శాఖ, రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల సిబ్బందితో సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు. తగరపువలసలోని మూడు దుకాణాల్లో ఇళ్లకు ఉప యోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించి 6ఏ కేసు నమోదు చేసి, ఆయా షాపులను సీజ్ చేశారు. అలాగే రెండు రెస్టారెంట్లలో వాణిజ్యపరమైన గ్యాస్ కాకుండా గృహోపకరణానికి ఉపయోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించి కేసులు నమోదు చేశారు.

ఆంధ్ర వైద్య కళాశాలలో స్వాతంత్ర్య వీచిక

... 7వ పేజీ తరువాయి

సతీమణి చిట్టిజానకమ్మ వాల్తేర్‌లో కొంత భూమి, భవనాలు విరాళంగా ఇవ్వడంతో 1912లో పాఠశాలను అక్కడకు తరలించారు. అక్కడే ఆంధ్ర వైద్య కళాశాలగా ప్రారంభం కావడంతో తొలిసారిగా 32 మంది విద్యార్థులకు ప్రవేశాలు ఇచ్చారు. ఉత్తరాంధ్ర పరిసరాలకు చెందిన విద్యార్థులు ఎంబీబీఎస్ ఇంకా లైసెన్సియట్ ఎల్ఎంఎస్ కోర్సుల్లో చేరారు. అయితే కళాశాల నిర్వహణ పూర్తిగా ఆంగ్లేయులు రూపొందించిన నిబంధనల మేరకు నడిచేది. అప్పటికే స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా జరుగుతోంది. విద్యార్థులు పోరాటంలో పాల్గొనే అవకాశం ఉందని భావించిన ఆంగ్లేయ అధికారులు, సూటు, బూటు నిబంధన అమలుచేశారు. అయితే 1921 సెప్టెంబరు 28వ తేదీన వైద్య కళాశాలలో చదువుతున్న 142 మంది విద్యార్థులు సూటు, బూటును వదిలి స్వాతంత్ర్య పోరాటానికి సంఘీభావంగా గాంధీ టోపీలు, ఖాదీ వస్త్రాలు ధరించి తరగతులకు హాజరయ్యారు. ఇది ఒక్కసారిగా వైద్య కళాశాలలో కలకలం రేపింది. విద్యార్థులను ప్రశ్నించడంతో వారంతా ఎదురుతిరిగారు. డ్రెస్ కోడ్‌పై స్థానిక కోర్టులు విధించిన ఆంక్షల పట్ల నిరసన తెలిపారు. డ్రెస్ కోడ్ ఉల్లంఘనపై క్షమాపణ చెప్పాలని వైద్య కళాశాల అధికారులు ఆదేశించగా, 32 మంది నిరాకరించారు. దీంతో ఆ 32 మందిని వైద్య కళాశాల నుంచి తొలగించారు.

ఈ విషయం దేశంలో స్వాతంత్ర్య ఉద్యమ నాయకులకు చేరింది. 32 మంది వైద్య విద్యార్థుల దేశభక్తిని మహాత్మాగాంధీ తన యంగ్ ఇండియా పత్రికలో అదే ఏడాది నవంబరు 24న ప్రస్తావించారు.

'దేశం దీర్ఘకాలిక బానిసత్వ వ్యాధితో బాధపడుతుంది. ఈ వ్యాధికి నిజమైన నివారణను కనుగొనేందుకు అంకితం చేసుకునే వారే నిజమైన సర్జన్లు, వైద్యులు అవుతారు. ఆ సార్వత్రిక వ్యాధి నయమైనప్పుడు ప్లేగు, కలరా, మలేరియా తదితర వ్యాధులు చాలావరకు అదృశ్యమవుతాయి.' అని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు ఏవీఎన్, సీబీఎం స్కూలు విద్యార్థులు సంఘీభావం తెలిపారు. ఈ ఘటనపై దేశంలో అనేక ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్తరాలను యంగ్ ఇండియాలో ప్రచురించడానికి గాంధీ అంగీకరించారని విశాఖలో స్వాతంత్ర్య పోరాటానికి ముందు నుంచి ఇటీవల జరిగిన అనేక మార్పులపై పరిశోధన చేసిన జాన్ కాస్టిల్ పేర్కొన్నారు.

ఖాదీ దుస్తులు, టోపీ ధరించినందుకు సస్పెండైన 32 మంది వైద్య విద్యార్థులలో కొంతమందిని తరువాత చేర్చుకోగా, మరికొందరు వేరే కళాశాలలకు వెళ్లిపోయారు. ఇలా సస్పెండైన వారిలో నగరానికి చెందిన డాక్టర్ ఎంవీ కృష్ణారావు ఒకరు. ఆయన ఆంధ్ర వైద్య కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థి. వైద్య విద్య పూర్తిచేసి రాజకీయాల్లోకి వచ్చి మద్రాస్ రాష్ట్రంలో చక్రవర్తుల రాజగోపాలాచారి మంత్రివర్గంలో వైద్య, విద్య, హరిజన వెల్ఫేర్ (ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ) మంత్రిగా పనిచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యుడిగా 40 ఏళ్ల పని చేశారు.



పార్కును శుభ్రం చేస్తున్న తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

కూర్మన్నపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు సమాజంలో ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధి జి.విశ్వేశ్వరరావు అన్నారు. 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో గురువారం స్వచ్ఛాంధ్ర ఏకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా పార్కుల్లో చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు రోడ్లను శుభ్రం చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఎవరూ నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించరాదని కోరారు. అందరూ మొక్కలను పెంచాలన్నారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డి, డాక్టర్ ప్రభుదాస్, ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆవును కాపాడిన సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఓపెన్ సంప్‌లో ఓ ఆవు పడిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న సత్యసాయి సమితి స్టీల్ ప్లాంట్ శాఖ ప్రతినిధులు స్థానికుల సహకారంతో ఆ ఆవును సురక్షితంగా బయటకు తీశారు. అయితే ఆవు గర్భం దాల్చి ఉండడంతో వెటర్నరీ వైద్యుడు చిరంజీవి దానికి వైద్యం చేశాక ఓ వ్యాన్‌లో దేవాడలో గల యజమాని వద్దకు తీసుకువెళ్లి అప్పగించారు. సకాలంలో ఆవును సంప్ నుంచి బయటకు తీయడంతో ప్రాణాపాయం తప్పిందని సేవాదళ్ సభ్యుడు రామచంద్రరావు తెలిపారు.

ముత్యమాంబ ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరంలో గల శ్రీముత్యమాంబ ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, పసుపు, కుంకుమపూజలు, అభిషేకాలు చేశారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, న్యూపోర్టు సీఐ టి.కామేశ్వరరావు, టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రామాలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పాత దానబోయినపాలెంలో గల సీతారామాలయ వార్షికోత్సవాన్ని గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామున సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అర్చకులు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తో పాటు పలువురు కూటమి నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గవ్వ రామకృష్ణ, ఆదిలక్ష్మి, గామ పెద్దలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),

● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),

● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 24, బీరకాయలు 18, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
లైవ్ ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ఎల్‌పి నగర్‌లో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, విద్యార్థులు, తదితరులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీలను ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్‌లో విద్యార్థులు చేపట్టిన ర్యాలీని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల జీవితాలను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి లక్కరాజు సోంబాబు, సీనియర్ నాయకుడు బాటా శ్రీను మాట్లాడుతూ అందరూ తమ ఇళ్లపై మువ్వన్నెల పతాకాలను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు దేనంకొండ పావని, హెచ్ఎం సత్య, పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి మినీ జగదాంబ జంక్షన్‌లో గల విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు భారతదేశ గొప్పతనం గురించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోసూరి తాతారావు, త్రినాథ్, రవీంద్రకుమార్, పాఠశాల ప్రతినిధులు కేవీ సత్యనారాయణ, పద్మావతి, రవి, ప్రసన్న, శ్రీరాములు, సుజాత, దేవిక, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల వేతన బకాయిల కోసం సంతకాల సేకరణ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, వేతన బకాయిలను చెల్లించాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరాం డిమాండ్ చేశారు. వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్లాంట్ ప్రధాన గేటు వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు ఇప్పటివరకు 330 శాతం వేతనం పెండింగ్‌లో ఉందని, ప్యాకేజీ ఇచ్చామని కేంద్రం చెబుతున్నప్పటికీ వీటిలో ఒక్క రూపాయిని కూడా ఉద్యోగుల కోసం కేటాయించలేదన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభం తరువాత ఉద్యోగులకు పూర్తి స్థాయి వేతనం చెల్లిస్తామన్న ఉక్కు యాజమాన్యం ఆ మాటను విస్మరించిందన్నారు. యాజమాన్యం కార్మికుల పట్ల వివక్ష చూపుతుందని మండిపడ్డారు. నాయకులు యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, తౌడన్న, అప్పలరాజు, శ్రీనివాసరెడ్డి, నరసింగరావు, శ్రీనివాస్, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వినతి

స్టీల్ ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ హరింధరప్రసాద్‌కు 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం గురువారం వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులను విధుల నుంచి తప్పించడం భావ్యం కాదన్నారు. దీనివల్ల వందలాది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరిగినా కార్మికులకు అనుకూలంగా నిర్ణయాలు రాలేదన్నారు. అలాగే తొలగించిన కాంట్రాక్టు కార్మికుల్లో అత్యధికులు ఉక్కు నిర్వాసితులు ఉన్నారని కలెక్టర్‌కు వివరించారు. అందువల్ల తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పీఎఫ్ కమిషనర్‌కు భెల్ కార్మికుల విజ్ఞప్తి

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ కార్మికుల పీఎఫ్ రికార్డుల్లో డేట్ ఆఫ్ జాయినింగ్ నమోదులో జరిగిన పొరపాట్లను సరిదిద్ది కార్మికులకు న్యాయం చేయాలని పీఎఫ్ కమిషనర్ ఎ.మిశ్రాకు భెల్ హెచ్‌పీవీపీ బీఎంఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం నగరానికి విచ్చేసిన బీఎంఎస్ కేంద్ర కమిటీ నాయకుడు సుంకరి మల్లేశం ఆధ్వర్యంలో భెల్ బీఎంఎస్ నాయకులు పీఎఫ్ కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించారు. సంస్థలో సుమారు 140 మంది కార్మికుల పీఎఫ్ రికార్డులో డేట్ ఆఫ్ జాయినింగ్ తప్పుగా నమోదవ్వడం వల్ల పెన్షన్‌లో నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పీఎఫ్ అకౌంట్‌లో డేట్ ఆఫ్ జాయినింగ్‌ను సరిచేయడంతో పాటు హయ్యర్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర నాయకులు ఐ.ముత్యాలు, ఎంవీఎస్ నాయుడు, లావా రెడ్డి, రమేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో రాణించిన శాన్వి



కాంస్య పతకంతో శాన్వి

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): న్యూ ఢిల్లీలోని టాక్లటోరా ఇండోర్ స్టేడియంలో గత వారం జరిగిన ఆలిండియా ఇండిపెండెన్స్ కప్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో షీలానగర్‌కు చెందిన పిళ్లా పుణీత శాన్వి కాంస్య పతకాన్ని సాధించింది. పన్నెండేళ్ల విభాగంలో శాన్వి మంచి ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించినట్టు కోచ్ కె.మనోజ్‌కుమార్ తెలిపారు. గాజువాకలోని టింపనీ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న శాన్విని పాఠశాల యాజమాన్యంతో పాటు స్థానికులు అభినందించారు.

చైన్ స్నాచర్ అరెస్టు



నిందితుడు ఆనంద్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉక్కు టౌన్‌షిప్ ప్రాంతంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని గురువారం స్టీల్ ప్లాంట్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల రెండున టౌన్‌షిప్ ప్రాంతంలో కుర్ర రమాదేవి అనే మహిళ ఉదయం ఆరున్నరప్పుడు వాకింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అడ్రస్ అడిగారు. ఆమె తెలియదని చెప్పగా, కొద్దిగా ముందుకు వెళ్లి ఓ వ్యక్తి మళ్లీ వెనక్కి వచ్చి రమాదేవి మెడలో ఉన్న 12.5 గ్రాముల బంగారు చైనును లాక్కుని వెళ్లిపోయాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో సౌత్ క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ రుక్మందనరావులు దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో గాజువాక అజీమాబాద్ ప్రాంతానికి చెందిన చేపల ఆనంద్ (21) నేరానికి పాల్పడినట్టు గుర్తించి గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి బంగారు చైనుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆనంద్‌పై పలు స్టేషన్లలో కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పి.గణబాబు

పెందుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 19 మంది బాధితులకు రూ.13.65 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం సూపర్ హిట్ కొట్టిందని అన్నారు. 'సూపర్ సిక్స్ హామీలు ఇప్పుడు సూపర్‌హిట్' అని కొనియాడారు.

కాంట్రాక్టర్లకు రూ.86.27 లక్షలు చెల్లింపు

2014 - 19 టీడీపీ హయాంలో పెందుర్తి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు చేపట్టిన 41మంది కాంట్రాక్టర్లకు మొత్తం బకాయి బిల్లులు రూ.82.27 లక్షలు చెల్లించామని పంచకర్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం, ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

గవరకంచరపాలెంలో...

ఆర్పీ పేట,(కంచరపాలెం), (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు గవరకంచరపాలెం గ్రామంలో అనారోగ్యం బారిన పడిన బాధితులకు గురువారం ఎమ్మెల్యే గణబాబు స్వయంగా వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆళ్ల వెంకట జగద అప్పారావు అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకున్నారు. కొద్ది రోజులకు మరణించారు. చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.71,160 చెక్కును అప్పారావు భార్య లతకు అందించారు. అలాగే పైడిమాంబ కాలనీలో తిధిరాజు ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల్లో గణపతినగర్ కొండ

▸▸ పరిశీలించిన రెవెన్యూ అధికారులు

మల్కాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ములగాడ తహశీల్దార్ కార్యాలయానికి కొంత దూరంలో ఉన్న గణపతినగర్ సర్వే నంబర్ 55 కొండమీద జోరుగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఓ నాయకుడి అండ దండలతో నిర్మాణాలు కోసం కొండను చదును చేస్తున్నారని సమాచారం. గతంలో జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం, నీటి సరఫరా కోసమని కొండ ప్రదేశంలో పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని లెక్క చేయకుండా కొండను చదునుచేస్తున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ రమేశ్ ఆర్ఐ దివ్యను, సిబ్బందిని స్థలాన్ని పరిశీలించడానికి గురువారం పంపించారు. దాదాపు 15 ప్లాట్ల వరకు చదును చేసినట్టు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా 'ఇది ప్రభుత్వ స్థలం' అనే బోర్డు పెట్టడానికి అధికారులు అంతా సిద్ధం చేశారు. ఓ వ్యక్తి మాత్రం 60 గజాలకు తనకు చెందినదని పట్టా చూపించారు. అయితే ఆ స్థలం ఆక్రమించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

'పేదరికం నిర్మూలనకు పీ4'

సింధియా, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతన్న పీ4 పాలసీ మార్గదర్శకాలను జీవీఎంసీ 62వ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు వార్డులోని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే 63వ వార్డులో చింతపల్లి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ గల్లా పోలిపిల్లి(చిన్నా) ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు

వేపగుంట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌టీఎల్ విద్యుత్తు సబ్‌స్టేషన్ నుంచి ప్రహ్లాదపురం సబ్‌స్టేషన్ వరకు అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నగరంలో ఉన్న అన్ని సబ్‌స్టేషన్లను కలుపుతూ ఈ విద్యుత్ కేబుల్ పనులను దాదాపు రూ.700 కోట్ల ఖర్చుతో నిర్వహిస్తున్నారు. అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనుల పూర్తయితే వర్షాలు, ఈదురుగాలులు వచ్చినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉంటుందని తెలిపారు. వీధుల్లో పెద్ద పెద్ద వాహనాలు వెళ్లినప్పుడు విద్యుత్ వైర్ల సమస్య ఉండదని అన్నారు.

భూ సేకరణపై అభ్యంతరాలు స్వీకరణ

పెందుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సింహాచలం నార్త్, పెందుర్తి స్టేషన్‌ల మధ్య నిర్మిస్తున్న రైల్వే ప్రాజెక్టు కోసం భూ సేకరణకు సంబంధించి రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరణ సమావేశం పెందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆర్డీవో శ్రీలేఖ బాధిత రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. రైల్వే ప్రాజెక్టుకు ఉపయోగించే భూములు దేవస్థానానికి చెందడంతో రైతులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వడం కుదరదని పలువురు అధికారులు పేర్కొన్నారని రైతులు వాపోయారు.

ప్రజా ప్రయోజనం కోసం దేవస్థానం భూములను వినియోగిస్తే వచ్చే నష్టపరిహారాన్ని దేవస్థానానికి, రైతులకు సరి సమానంగా పంచాలనే విషయాన్ని రైతులు గుర్తు చేశారు. దీంతో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వెంకట అప్పారావు తెలిపారు.

రుషికొండ ఆలయంలో నిలిచిన లడ్డూ విక్రయాలు

సాగర్‌నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడురోజులు పాటు లడ్డు విక్రయాలు నిలిపివేస్తున్నట్టు ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. తిరుపతిలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా లడ్డు రవాణాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు లడ్డూ విక్రయాలు నిలిపివేస్తున్నామని, శ్రీవారి భక్తులు గమనించాలని కోరారు.

బోటు షికార్ నిలిపివేత

సాగర్‌నగర్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో గురువారం మధ్యాహ్నం నుంచి బోటుషికార్ నిలిపి వేశారు. పర్యాటకాభివృద్ధి, ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో రుషికొండబీచ్‌లో ఆరుబోట్లతో బోటుషికార్ నిర్వహిస్తున్నారు. అల్పపీడనం కారణంగా వాతావరణం అనుకూలించక పోవడంతో దీనిని నిలిపివేశామని నిర్వాహకులు తెలిపారు. సందర్శకులు గమనించాలని కోరారు.

నేడు, రేపు మాంసం దుకాణాలకు సెలవు

వెంకోజీపాలెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని అన్ని మాంసం దుకాణాలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం, కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా శనివారం సెలవులు ప్రకటించినట్టు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్‌వీ నరేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో వేటమాంసం, కోడి మాంసం, చేపలు, రొయ్యలు తదితర దుకాణాలకు, జంతు వధశాలలకు సెలవు ప్రకటించినందున సంబంధిత దుకాణాలు, జంతు వధశాలలు మూసివేయాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎంఓహెచ్ హెచ్చరించారు.

కిరండూల్ పాసింజర్‌కు అదనపు కోచ్

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగిస్తున్న పాసింజర్ రైళ్లకు (58501/58502) ఈనెల 15 నుంచి సెప్టెంబరు ఒకటో తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.



విద్యుత్ దీపాలతో శోభాయమానంగా వెలుగొందుతున్న విశాఖ రైల్వే స్టేషన్



సబ్ మెరైన్ మ్యూజియం వద్ద పోరాట యోధుల వేషధారణలో చిన్నారులు

స్వాంతంత్ర్య వేడుకలకు సిద్ధం

స్వాతంత్ర్య వేడుకలకు నగరం ముస్తాబయింది. వివిధ కార్యాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో రిహార్సల్స్ జరిగాయి. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శకటాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది



విద్యుత్ దీపాలంకరణలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం

ఏయూలో స్వాతంత్ర్య పోరాటం



విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటం వాల్తేరు లోని ఆంధ్ర విశ్వ విద్యాలయంపై తీవ్ర ప్రభావం చూపింది. స్వాతంత్ర్య ఉద్యమానికి పలువురు ఆచార్యులు పరోక్షంగా మద్దతు ఇవ్వగా విద్యార్థులు రెండు మూడు పర్యాయాలు నేరుగా పాల్గొన్నారు. గాంధీ పిలుపుమేరకు 1942లో క్విట్‌ఇండియా ఉద్యమం ఉధృతం సాగుతుండేది. ఈ సెగ ఏయూకు పాకింది. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, క్విట్ ఇండియా ఉద్యమం లక్ష్యాలను వివరిస్తూ ఏయూ విద్యార్థులు రాసిన రాతలతో వర్సిటీ గోడలు నిండిపోయాయి. విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. అదే సమయంలో ఏయూలో స్నాతకోత్సవం జరిగింది. ప్రస్తుతం ఇన్‌గేట్‌లోకి రాగానే కుడివైపున ఉండే స్టూడెంట్ హోమ్ వెనుక రేకుల షెడ్‌ను స్నాతకోత్సవ వేదికగా నిర్ణయించారు. దీనికి వర్సిటీ కులపతి హోదాలో మద్రాస్ గవర్నర్ సర్ ఆర్థర్‌హోప్ వచ్చారు. ఆ సమయంలో ఉపకులపతిగా డా.కట్టమంచి రామలింగారెడ్డి, ప్రో చాన్సలర్‌గా జయపూర్ విక్రమదేవ్ వర్మ వ్యవహరించేవారు. స్నాతకోత్సవానికి గవర్నర్ హోప్ ఇన్‌గేటు నుంచి వచ్చేసరికి విద్యార్థులంతా హాస్టల్ భవనాలుపైకి వెళ్లి లౌడ్‌స్పీకర్ల ద్వారా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధానంగా గవర్నర్ హోప్ గోబ్యాక్.. అంటూ హోరెత్తించారు. గవర్నర్‌తో కలిసి వచ్చిన జిల్లా కలెక్టర్ మారథన్‌మేన్ జోక్యం చేసుకుని, విద్యార్థులపై లాఠీచార్జి చేయాలని జిల్లా ఎస్పీని ఆదేశించారు. దీంతో వర్సిటీ పరిసరాలు ఉద్రిక్తంగా మారాయి. ఆ సమయంలో ఆర్ట్స్ కళా శాల ప్రిన్సిపాల్ విస్సా అప్పారావు వెంటనే జోక్యంచేసుకుని పోలీసులు హాస్టల్‌లోకి ప్రవేశించరాదని స్పష్టంచేశారు. వారంతా మా పిల్లలు.. వారిపై లాఠీచార్జికి నేను వ్యతిరేకమని కలెక్టర్‌కు స్పష్టం చేశారు. స్నాతకోత్సవానికి ఇబ్బం ది లేకుండా చూస్తానని వారికి మాటిచ్చి విద్యార్థుల దగ్గరకు వచ్చి నచ్చచెప్పి శాంతింపజేశారు. తరువాత స్నాతకోత్సవం సాఫీగా జరిగింది. మరో ఘటనలో (తేదీ స్పష్టంగా లేదు) వర్సిటీకి చెందిన 30 మంది విద్యార్థులు గాంధీ టోపీలు ధరించి తరగతులకు హాజరయ్యారు. దీనిపై బ్రిటిష్ అధికా రులకు ఫిర్యాదు అందగా వారికి నోటీసులు ఇచ్చారు. అయినా టోపీలతోనే తరగతులకు హాజరై దేశభక్తిని చాటుకున్నారు. అదే సమయంలో వర్సిటీలో విద్యార్థి నాయకులు కేవీ గోపాలస్వామి, లంక సుందరం మాక్ పార్లమెంట్ నిర్వహించగా 30 మంది విద్యార్థులు గాంధీ టోపీలు ధరించి హాజరయ్యారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆనందపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన భీమిలి క్రాస్ రోడ్డు సమీపంలోని సత్యకళ్యాణి అపార్టుమెంట్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల మేరకు సత్యకళ్యాణి అపార్టుమెంట్‌లో నివాసముంటున్న మేకల సాయికుమార్ (48) ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య కళ్యాణి విజయనగరం జిల్లా గజపతినగరం ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో పాన్‌షాప్ దగ్ధం



మంటల్లో కాలిపోతున్న పాన్‌షాప్

ఎండాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని శాంతినగర్‌లో గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. పూడి అప్పయమ్మ పాన్‌షాపు నిర్వహిస్తోంది. తెల్లవారుజామున దుకాణంలో మంటలు రేగి పూర్తిగా కాలిపోయింది. సమీపంలో నిలిపి ఉంచిన ఆటో సగానికి పైగా దగ్ధమయింది. అగ్నిమాపక అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంపై బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరో కావాలనే నిప్పు పెట్టారని బాధితురాలు వాపోతోంది. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని గగ్గోలు పెడుతోంది. ఈ మేరకు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చీటీల పేరుతో రూ.2 కోట్లకు టోకరా

» నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

గోపాలపట్నం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో ప్రజల నుంచి సుమారు రూ.2 కోట్లు వసూలు చేసి టోకరా వేసిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం

గోపాలపట్నం సమీపంలోని ఇందిరానగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన అంబల్ల సత్యవతి, అంబల్ల బంగారు నాయుడు, అంబల్ల తేజస్విని, అంబల్ల నాగలక్ష్మి గత కొంత కాలంగా అనధికారికంగా చిట్స్ నిర్వహిస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజల నుంచి భారీగా సొమ్మును వసూలుచేసి తిరిగి చెల్లించలేదు. దీంతో బాధితులు ఈనెల 12న పోలీసులను ఆశ్రయించారు. సీఐ ఎస్‌వీ ప్రభాకర్ దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నలుగురు నిందితులను బుధవారం రాత్రి అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారన్నారు.

కొనసాగుతున్న అప్పన్న ఆభరణాల తనిఖీ

సింహాచలం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అప్పన్నకు భక్తులు సమర్పించిన రజిత, స్వర్ణ ఆభరణాల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఫైవ్‌మన్ కమిటీ సారథి కేఎన్‌వీడీవీ ప్రసాద్, సభ్యులు గురువారం అర్చకుల ఆధీనంలోని ఆభరణాలను రికార్డులకు అనుగుణంగా సరిచూసుకున్నారు. సాధారణ విధులకు ఇవి అదనం కావడంతో భారం పెరిగిందని, దీంతో ఆభరణాల తనిఖీకి సమయం కేటాయించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అంతర్వేది ఈఓ ప్రసాద్, సింహాచలం డిప్యూటీ ఈఓ సింగం రాధ, పర్యవేక్షణాధికారి సత్యవాణి, తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు ప్రయోగాత్మక హాల్ట్‌లు కొనసాగింపు

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు పలు రైళ్లకు ప్రవేశపెట్టిన ప్రయోగాత్మక హాల్ట్‌లు కొనసాగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (17015) ఈనెల 15 నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌లో హాల్ట్ ఉంటుందన్నారు. వచ్చే నెల 20 నుంచి పూరి-తిరుపతి (17479), బిలాస్‌పూర్-తిరుపతి (17481), వచ్చే నెల 22 నుంచి తిరుపతి-పూరి (17480), వచ్చేనెల 18 నుంచి తిరుపతి-బిలాస్‌పూర్ (17482)లకు కొవ్వూరు స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది. ఇక భువనేశ్వర్-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్‌కు (20896) (కొత్త నంబరు 20849) వచ్చే నెల 26 నుంచి, తిరుగు ప్రయాణంలో రామేశ్వరం-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌కు (20895) (కొత్త నంబరు 20850) వచ్చే నెల 28 నుంచి రాజమండ్రిలో హాల్ట్ ఉంటుంది. వచ్చే నెల 24 నుంచి పాండిచ్చేరి-హౌరా ఎక్స్‌ప్రెస్ (12868)కు ఇరువైపులా రాజమండ్రిలో హాల్ట్ కొనసాగుతుందని వివరించారు.

స్టీల్‌ప్లాంటు విశ్రాంత ఉద్యోగుల కృతజ్ఞతా ర్యాలీ



ఎంపీ శ్రీభరత్‌ను సత్కరిస్తున్న ఉక్కు విశ్రాంత ఉద్యోగులు

బీచ్ రోడ్డు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అధిక పెన్షన్ మంజూరు చేసినందుకు గాను ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతూ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులు గురువారం బీచ్‌రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ పని మన చేతుల్లో ఉంది, ఫలితం లేదని పేర్కొన్నారు. ప్లాంటులో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తున్నామని, కేంద్రం ఇటీవల రూ.11,440 కోట్లు సాయం చేసిందన్నారు. ఐరన్ ఓర్ సరఫరాకు ఎన్‌ఎండీసీతో ఒప్పందం కుదిరిందన్నారు. 15 నెలలుగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న అధిక పెన్షన్ సమస్యను పరిష్కరించామని, దీనివలన ఐదువేల మంది విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనం చేకూరిందన్నారు. ఏసీ ఎన్‌సీవోఏ చైర్మన్ వీకే తోమర్ మాట్లాడుతూ జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదపడిన ఉక్కు ఉద్యోగులకు మెరుగైన జీవితం కోసం అధిక పెన్షన్ ఎంతో సాయపడుతుందన్నారు. అనంతరం ఆర్కేబీచ్ కాళికామాత ఆలయం నుంచి అంబికా సీ గ్రీన్ హోటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ అధ్యక్షుడు కాటం చంద్రరావు, జనరల్ సెక్రటరీ కేవీడీ ప్రసాద్, వాసమూర్తి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో చిచ్చరపిడుగు

» అవార్డులతో రాణిస్తున్న భవజ్ఞ



రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న భవజ్ఞ (ఫైల్)

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థిని చలపరెడ్డి భవజ్ఞ చిత్రలేఖనంలో అద్వితీయ ప్రతిభ కనపరుస్తున్నది. మూడోతరగతి చదువుతున్నప్పుడే కుంచెపట్టి నైపుణ్యానికి పదునుపెట్టింది. ఎనిమిదేళ్ల వయసులో గూగుల్ చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని జాతీయ ఫైనలిస్టుగా నిలిచింది. 2020లో సురనందన్ భారతి చిత్రలేఖనం పోటీల్లో గ్రూప్ -బి నుంచి తృతీయ స్థానం సాధించింది. అంతర్జాతీయ వీసప్ ఆర్ట్ ఫ్రమ్ హార్ట్ పోటీల్లో విజేతగా, విశాఖ ఇషార్ జాతీయ కె12 పోటీల్లో గ్రూపు ఎ నుంచి ప్రథమస్థానం సాధించింది. శ్రీదర్శిని కళాయికూడం చిత్రలేఖనం పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో 8వ స్థానాన్ని, ఖరగ్‌పూర్ జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో నాల్గో స్థానం, 2020 ఐఎస్‌టీఏ జాతీయ చిత్రలేఖనం పోటీల్లో విజేతగా నిలిచింది. కాసుల చిత్రకళ అకాడమీ నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో బాల ప్రతిభా అవార్డును దక్కించుకుంది. 2022లో ఎన్‌ఎస్‌టీఎల్ నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ప్రథమం,హిందూ యంగ్ వరల్డ్ జేఎస్‌డబ్ల్యూ చిత్రలేఖనం పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి రూ.10వేలు నగదు బహుమతి అందుకుంది. బుద్ధపూర్ణిమ సీజన్ -2 జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో బంగారు పతకాన్ని, అఖిల భారత శ్రీదర్శిని కళాయిగూడెం నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో విష్ణుకుండిన, బెస్ట్ ప్రజంటేషన్ అవార్డు సాధించింది. 2024లో ఆలిండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్ పోటీలో అఖిలభారత బాలచిత్రకళ అవార్డును, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. ఎన్నో అవార్డులు సాధించిన ఈ బాల చిత్రకారిణిని శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసుప్రకాశ్ అభినందించారు.



సాధించిన అవార్డులు (ఇన్‌సెట్‌లో) చలపరెడ్డి భవజ్ఞ

నేడు కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఆవిష్కరణ



విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మించిన జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం శుక్రవారం ప్రారంభించనున్నారు. సుమారు రూ.75 లక్షలతో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ నిర్మాణం జరిగింది. గతంలో ఉన్న గేట్ల స్థానంలో ఎత్తుగా, భారీ గేట్లు ఏర్పాటుచేశారు. ద్వారం పైభాగాన నాలుగు సింహాలను అమర్చారు. గత కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున హయాంలో కొత్త గేటు నిర్మాణానికి నిధులు కేటాయించారు. పూర్తిస్థాయిలో నిర్మించడానికి ఏడాదిన్నర సమయం పట్టింది.

కాంట్రాక్టర్ల సంఘం నేతల అవినీతిపై విచారణ జరపండి

» జీవీఎంసీ కమిషనర్‌కు కాంట్రాక్టర్లు ఫిర్యాదు
» వివరాలు సేకరించిన నిఘా వర్గాలు

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ట్యాంకర్లతో నీటి సరఫరాకు వాహనాలను సమకూర్చేందుకు పిలిచిన టెండర్లలో కాంట్రాక్టర్ల సంఘం నేతలు చేసిన అవినీతిపై విచారణ జరపాలంటూ జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు కొందరు కాంట్రాక్టర్లు గురువారం ఫిర్యాదు చేశారు. నగర పరిధిలోని నీటిసరఫరా నెట్‌వర్క్‌లేని, కొండవాలుతోపాటు వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తే ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరాకు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఇటీవల టెండర్లు పిలిచారు. అయితే కాంట్రాక్టర్ల సంఘం పేరుతో కొందరు నేతలు ఆయా పనులకు టెండర్లు ఎవరూ ఆన్‌లైన్‌లో వేయవద్దని ఆదేశించారు. తాము లాటరీ ద్వారా కేటాయిస్తామని, ఎవరు ఎంపికైతే వారే టెండర్‌వేసి దక్కించుకుంటారని నిబంధనపెట్టారు. కాదని ఎవరైనా టెండర్ వేస్తే తమచేతిలో ఉన్న ఇంజనీరింగ్ అధికారుల ద్వారా వారిని అనర్హులుగా చేయడంతోపాటు వారుచేస్తున్న పనులకు సంబంధించిన బిల్లు లు నిలిపివేయిస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో లాటరీలో ఎంపికైనవారే పనులను దక్కించుకున్నారు. అలాచేసినందుకు యూనియన్‌కు, అధికారులకు మామూలు కింద పర్సంటేజీలు వసూలుచేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుసకథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఇంటెలిజెన్స్‌తోపాటు విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి ట్యాంకర్ల కాంట్రాక్టుల ఉదంతంపై ఆరా తీసినట్టు తెలిసింది. యూనియన్‌పేరుతో ఒకరు దందా చేస్తున్నారని కాంట్రాక్టర్లు చెప్పడంతోపాటు నీటి సరఫరా విభాగాన్ని లాటరీలకు కేరాఫ్‌గా మార్చేయడం నిజమేనని వివరించినట్టు సమాచారం. నిఘా విభాగాల అధికారులు దీనిపై కొన్ని ఆధారాలను సేకరించినట్టు తెలిసింది. మరోవైపు కాంట్రాక్టర్లలో చాలా మంది యూనియన్ నేతల అరాచకాలపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. టెండర్లలో పారదర్శకత కోసం ప్రభుత్వాలు రూపొందించిన ఈ-ప్రొక్యూర్‌మెంట్‌ను కాదని, లాటరీల ద్వారా పనులు కేటాయిస్తామని హడావుడిచేయడం, బెదిరించడంతో వారంతా రగిలిపోతున్నారు. ఇటీవల నీటిసరఫరా విభాగంలో జోన్‌ల వారీగా వాటర్ ట్యాంక ర్ వాహనాలను సమకూర్చేందుకు పిలిచిన టెండర్లలో యూనియన్‌పేరుతో కొందరు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేయడంతో అక్రమార్కుల్లో గుబులు నెలకొంది.

ఓటు చోరీపై ఈసీని నిలదీయాలి: విదసం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విదసం నాయకులు

సిరిపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఓటు చోరీపై ఈసీని నిలదీయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని విదసం ఐక్యవేదిక కన్వీనర్ బూసి వెంకటరావు కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం విదసం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ద్వారా ఒక మనిషికి ఒకే ఓటు నేపథ్యంలో ఇటీవల జరిగిన ఓట్ల చోరీపై ప్రజలు అప్రమత్తమయ్యారన్నారు. బీహార్, కర్ణాటకలో ఓట్ల మాయాజాలంపైన అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనన్నారు. జాజి ఓంకార్, సుధాకర్, ప్రసాద్,భాస్కరరావు, నిర్మల, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

షిప్‌యార్డులో 'ఐసీజీఎస్ సారంగ' నౌక రీఫిట్

» షెడ్యూల్ కంటే ముందే పనులు పూర్తి



ఐసీజీఎస్ సారంగ నౌక

మల్కాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కోస్టుగార్డుకు చెందిన పాతకాలపు నౌక ఐసీజీఎస్ సారంగ్ రీఫిట్ పనులను హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ షెడ్యూల్ కంటే మూడు రోజులు ముందుగానే పూర్తిచేసి గురువారం డెలివరీ ఇచ్చింది. ఈ నౌక ఏప్రిల్ 19న ఇక్కడకు వచ్చింది. ఆశా ఇంజనీరింగ్ వర్క్స్ సమన్వయంతో షిప్‌యార్డు ఈ పనులు పూర్తిచేసింది. స్టెర్న్ ట్యూబ్, బ్రాకింగ్ బేరింగ్‌ల మార్పు, ప్రొపెల్లర్ సాఫ్ట్ తొలగింపు లేకుండా షాప్ టన్నెల్ హాల్‌బేస్ ప్లేట్ల పునరుద్ధరణ, 140 మోటార్లు, 300 వాల్వులు, 40 పంపుల మరమ్మతులు, మూడు కిలోమీటర్ల పైపుల మార్పు చేపట్టారు. ఇంకా ఏసీ, అగ్నిమాపక ఇంధన వ్యవస్థలను వినియోగంలోకి తీసుకువచ్చారు.

భిక్షాటన రహిత నగరంగా తీర్చిదిద్దుతాం

» 243 మంది యాచకులకు ఆశ్రయం » సీపీ శంఖబ్రత బాగ్చి



యాచకులతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, తదితరులు

మహారాణిపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖను బెగ్గర్ ఫ్రీ సిటీగా మార్చేందుకు కృషి చేయనున్నట్టు పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోలీసు కమిషనరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సుమారు పది నెలలుగా తలపెట్టిన తమసోమా జ్యోతిర్గమయా పేరిట విశాఖ నగరాన్ని భిక్షాటన రహిత నగరంగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. ఈ క్రమంలో నగరంలో భిక్షాటన చేస్తున్న సుమారు 243 మంది యాచకులను రెస్క్యూ చేసి వారికి ఆశ్రయం కల్పించారు. కనీసం ఎలాంటి పనులు చేయలేని వారిని గుర్తించి, వారికి ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు. పనిచేసే సామర్థ్యం గల వారిని వారు చేయగలిగే పనిని అప్పగించేలా ఏర్పాట్లు చేశామని సీపీ వెల్లడించారు. గుర్తించిన 243 మంది యాకుల్లో 45 మంది పూర్తి ఆరోగ్యంగా, పనిచేసుకునే అవకాశం ఉన్న వారిగా గుర్తించి, వారి కుటుంబసభ్యులను రప్పించి, వారితో మాట్లాడి అప్పగించామన్నారు. మరో 9 మందికి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో మానసిక ఆస్పత్రికి తరలించి, తగిన వైద్యం అందిస్తున్నామన్నారు. మిగిలిన 189 మందికి ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో తమ వంతు పాత్ర పోషించిన వారందరికీ ఈ సందర్భంగా సీపీ కృతజ్ఞతలు తెలియజేశారు.